

## కలెక్టర్ రాజయ్యపేట పర్యటన వాయిదా

అనకాపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బుధవారం జరగాల్సిన కలెక్టర్ విజయకృష్ణన్ పర్యటన వాయిదా పడింది. బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా నెల నుంచి పోరాటం చేస్తున్న రాజయ్యపేట మత్స్యకారులు ఈ నెల 12వ తేదీన నక్కపల్లి వద్ద జాతీయ రహదారిని దిగ్బంధించిన విషయం తెలిసిందే. హైవేపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో కలెక్టర్‌తోపాటు ఎస్పీ తుహిన్ సిన్హా హుటాహుటిన నక్కపల్లి వచ్చి ఆందోళనకారులతో ... మిగతా 8వ పేజీలో

# ప్రారంభోత్సవాలకు నిరీక్షణ

### మూడుచోట్ల వినియోగంలోకి రాని పోలీసు స్టేషన్ల నూతన భవనాలు

- ఏడేళ్ల క్రితం టీడీపీ హయాంలో రూ.7.5 కోట్లు మంజూరు
- పనులు సైతం ప్రారంభం
- వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిలుపుదల
- రెండేళ్ల తరువాత పనులు పునరుద్ధరణ
- నాతవరం, గొలుగొండల్లో రెండేళ్ల క్రితం, కృష్ణాదేవిపేటలో పది నెలల క్రితం పూర్తి
- ప్రారంభోత్సవాలకు ముహూర్తం ఖరారు చేసిన అధికారులు
- అనివార్య కారణాలతో రెండుసార్లు వాయిదా
- శిథిల భవనాల్లో ఇబ్బంది పడుతున్న పోలీసు సిబ్బంది
- నూతన భవనాలను వెంటనే అందుబాటులోకి తేవాలని వినతి



నాతవరం పోలీసు స్టేషన్ నూతన భవనం

నాతవరం/ కృష్ణాదేవిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రెండు మండలాల్లో మూడుచోట్ల నిర్మించిన పోలీసు స్టేషన్ల నూతన భవనాలు ప్రారంభోత్సవాల కోసం ఎదురు చూస్తున్నాయి. నాతవరం, గొలుగొండల్లో రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు పూర్తికాగా, కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్ భవనం పది నెలల క్రితం పూర్తయ్యింది. గతంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడు 2018లో ఈ పోలీసు స్టేషన్లకు కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతోపాటు శంకుస్థాపనలు కూడా జరిగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రెండేళ్లకుపైగా పనులు ఆగిపోయాయి. అనంతరం పనులు చేపట్టినప్పటికీ నత్తనడకన సాగాయి. నాతవరం, గొలుగొండ స్టేషన్ల భవనాలు సుమారు రెండేళ్ల క్రితం పూర్తయ్యాయి. కృష్ణాదేవిపేట భవనం కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తయ్యింది. రెండు నెలల క్రితం పోలీసు స్టేషన్ల నూతన భవనాలను ప్రారంభించడానికి అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. కానీ కారణం ఏమిటో తెలియదుగానీ ఈ కార్యక్రమం వాయిదా పడింది. మళ్లీ ఈ నెల 4వ తేదీన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత చేతుల మీదుగా భవనాలను ప్రారంభిస్తామని అధికారులు మరోసారి ప్రకటించారు. మంత్రి పర్యటన రద్దు కావడంతో ఈసారి కూడా ప్రారంభోత్సవం చేయలేదు.

**నాతవరంలో..**

నాతవరంలో సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన పోలీసు స్టేషన్ భవనం చిన్నది కావడం, పెరుగుతున్న అవసరాలకు చాలకపోవడంతో నూతన భవనం నిర్మించాలని సుమారు ఏడేళ్ల క్రితం అధికారులు భావించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. వెంటనే నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. కొద్ది నెలలకే ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. పాలకుల ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. సుమారు రెండేళ్ల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. తరువాత ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పనులను పునరుద్ధరించారు. సుమారు రెండేళ్ల క్రితం భవన నిర్మాణం పూర్తయ్యింది. కానీ అప్పటి పాలకులు ప్రారంభించలేదు. ఎన్నికల తరువాత కూటమి అధికారంలోకి వచ్చింది. సుమారు ఏడాదిపాటు దీని గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఎట్టలకేలకు ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేశారు. కానీ వాయిదా వేశారు. మళ్లీ అక్టోబరు 4వ తేదీన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత చేతుల మీదుగా పోలీసు స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించారు. కూటమి నాయకులు భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు ... మిగతా 8వ పేజీలో



పది నెలల క్రితం నిర్మాణం పూర్తయిన కృష్ణాదేవిపేట మోడల్ పోలీస్ స్టేషన్ భవనం

# గూగుల్ రాక షురూ

### విశాఖ సిగలో కలికితురాయి




విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

**విశాఖపట్నం చరిత్రలో '2025 అక్టోబరు 14' మైలురాయిగా నిలిచిపోనుంది. భారతదేశ చరిత్రలో కూడా ఇదో పెద్ద విశేషం. ఇప్పటి వరకూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఈ స్థాయిలో ఏ రాష్ట్రానికీ రాలేదు. గూగుల్ సంస్థ విశాఖపట్నంలో రూ.87,520 కోట్లతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దీని ద్వారా రాబోయే రోజుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.88 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెబుతున్నారు. మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్ ఐటీలో ఎలా అభివృద్ధి సాధించిందో గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖ అలా వెలుగులీనుతుంది.**

- ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం
- ఉమ్మడి జిల్లాలో 480 ఎకరాలు కేటాయింపు
- పెట్టుబడులు రూ.87,520 కోట్లు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.88 లక్షల ఉద్యోగాలు
- గూగుల్‌తో చేతులు కలిపిన అదానీ కనెక్స్
- అంబరాన్ని అంటిన సంబరాలు
- డేటా హబ్‌గా మారనున్న నగరం

గూగుల్ డేటా సెంటర్ వల్ల 12 దేశాలతో విశాఖ నగరానికి సంబంధాలు కలుస్తాయి. ఏఐ, డేటా అనలిటిక్స్‌లో నిపుణులు తయారవుతారు. అనుబంధ సంస్థలు ఏర్పాటవుతాయి. ఐటీ ఎకో సిస్టమ్ పెరుగుతుంది. ఇది విశాఖను అంతర్జాతీయ స్థాయిలో నిలుపుతుంది. నగరం డేటా హబ్‌గా మారుతుంది.

**480 ఎకరాలు కేటాయింపు**

గూగుల్ డేటా సెంటర్‌కు ముందు ఆనందపురం మండలం తర్లువాడలో 200 ఎకరాలు ఇవ్వాలని అనుకున్నారు. కానీ వారి ప్రణాళికలు భారీగా ఉండడంతో అందుకు తగిన భూములు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తర్లువాడలో 200 ఎకరాలతో పాటు అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 120 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో మరో 160 ఎకరాలు ఇస్తామని ఒప్పందం చేసింది. ఇవి కాకుండా సింగపూర్ నుంచి సముద్ర అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కోసం తీర ప్రాంతంలో మరో 15 ఎకరాలు కేటాయించడానికి హామీ ఇచ్చింది. డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్‌ను అందించడానికి అదానీ సంస్థ గూగుల్‌తో చేతులు కలిపింది. అదానీ యాజమాన్యం మధురవాడలో తీసుకున్న 130 ఎకరాల్లో డేటా సెంటర్ చేయాల్సి ఉంది. దాని కోసం అదానీ కనెక్స్‌తో జాయింట్ వెంచర్ చేసింది. ఇప్పుడు ఆ సంస్థ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు, క్లీన్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీకి అవసరమైన సహకారం గూగుల్‌కు అందించనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన నీటిని ఇరవై ఏళ్ల పాటు అందించడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. పదేళ్లపాటు నీటి చార్జీలకు 25 శాతం రాయితీ ప్రకటించింది. విద్యుత్ సమకూర్చుకోవడానికి గూగుల్ పెట్టే వ్యయం ప్రభుత్వమే భరిస్తుంది. ఈ మొత్తం గరిష్ఠంగా రూ.500 కోట్ల వరకు ఉంటుందని అంచనా. రెన్యువబుల్ ఎనర్జీ ప్రస్తుతం మార్కెట్‌లో యూనిట్ రెండు రూపాయలకే దొరుకుతుండగా, అందులో యూనిట్‌కు రూపాయి రాయితీ ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఇలా 15 ఏళ్లు విద్యుత్ రాయితీ ఇస్తారు. ఇలా అనేక రాయితీలు ప్రభుత్వం ఇచ్చింది. గూగుల్ పెట్టుబడి రూ.87,520 కోట్లు అయితే అందులో నాలుగో వంతు అంటే సుమారుగా రూ.22 వేల కోట్లు రాయితీలుగా ఇవ్వడానికి ఒప్పందం జరిగింది.

### మిన్నంటిన సంబరాలు

- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందంపై ఆనందోత్సాహాలు
- బాణసంచా కాల్చి.. మిఠాయిలు పంపిణీ
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు అభినందనలు




బాణసంచా కాలుస్తున్న పీలా గోవింద, బత్తుల తాతాయ్యబాబు, మళ్ల సురేంద్ర

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్ రాకతో విశాఖ నగరం ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతుం దని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ... మిగతా 8వ పేజీలో

# కాపు భవనం కథ కంచికేనా!

### 'సబ్బవరం'లో శంకుస్థాపన చేసి ఏడేళ్లు

- రూ.15.5 లక్షల మేర పనులు
- కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వని వైసీపీ పాలకులు
- అప్పటి నుంచి పునాదుల్లోనే భవనం
- కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కాపు నేతల వినతి



కాపు సామాజిక భవన నిర్మాణం చేపట్టింది ఇక్కడే!

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

**మండలంలోని ఇరువాడ శివారు గణపతినగర్‌లో ఏడేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించిన కాపు సామాజిక భవనం ఇప్పటికీ పునాదుల స్థాయిలోనే వుంది. గత టీడీపీ హయాంలో పనులు ప్రారంభించగా, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. కూటమి అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు దాటినా అదే పరిస్థితి కొనసాగుతున్నది.**

సబ్బవరం మండలంలో కాపు సామాజిక భవనాన్ని నిర్మించాలని స్థానిక నేతలు విజ్ఞప్తి చేయడంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొండవాలు ప్రదేశంలో స్థలం కూడా కేటాయించడంతో సుమారు రూ.3 లక్షల ఖర్చుచేసి ఆ ప్రదేశాన్ని చదును చేయించారు. డిసెంబరు మూడో తేదీన కాపు సామాజిక భవన నిర్మాణానికి అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టారు. సుమారు రూ.12.5 లక్షల మేర పనులు పూర్తిచేసిన తరువాత బిల్లు అప్‌లోడ్ చేశారు. ఈ సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో వుండడం, తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో బిల్లు చెల్లింపు జరగలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. మూడేళ్ల తరువాత వైసీపీకి చెందిన కాపు నేతలు ఒత్తిడి చేయడంతో అప్పటి ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు ప్రయత్నించారు. మండల పరిషత్తు నుంచి రూ.5 లక్షలు, జిల్లా పరిషత్తు నుంచి రూ.5 లక్షలు కేటాయించేలా చర్యలు చేపట్టారు. అయితే నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించాలని పట్టుబట్టారు. అయితే భూమి చదును, మొదటి దశ నిర్మాణ పనులకు అయిన రూ.15.5 లక్షలను కాంట్రాక్టర్‌కు చెల్లించి, ఆ తరువాత డిపార్ట్‌మెంట్‌ను మార్చుకోవాలని నాడు నిర్మాణ పనులు పర్యవేక్షించిన ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులు స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు.. భవన నిర్మాణ పనులు పునఃప్రారంభం కాలేదు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కాపు సామాజిక భవన నిర్మాణం పునఃప్రారంభం అవుతుందని స్థానికులు భావించారు. కానీ ఇంతవరకు దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక శ్రద్ధతీసుకుని కాపు సామాజిక భవన నిర్మాణాన్ని పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని కాపు నేతలు కోరుతున్నారు.

# ప్రాథమిక వైద్యంపై సమ్మెట

### డిమాండ్ల సాధనకు పోరుబాట పట్టిన పీహెచ్‌సీల వైద్యులు

- రెండు వారాల నుంచి విధులకు గైర్హాజరు
- ఆస్పత్రుల్లో నిలిచిన వైద్య సేవలు
- అరకొరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- ఆయుష్, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల నుంచి డిప్యూటేషన్‌పై నియామకం
- రోగులకు పూర్తిస్థాయిలో అందని వైద్య సేవలు



నర్సీపట్నం మండలం వేములపూడి పీహెచ్‌సీలో ఖాళీగా వున్న డాక్టర్ ఛాంబర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందడంలేదు.**




గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జిల్లాలో 55 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వున్నాయి. ఒక్కో ఆస్పత్రిలో ఇద్దరు చొప్పున వైద్యులు వుంటారు. అయితే 110 మందికిగాను ప్రస్తుతం 107 మంది వైద్యులు వున్నారు. ఒక్కో ఆస్పత్రికి రోజుకు సగటున వంద మంది చొప్పున రోగులు వస్తుంటారు. కాగా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు పలు డిమాండ్లు, సమస్యలను ప్రభుత్వం ముందుంచారు. ఇన్ సర్వీస్ పీజీ కోటా సీట్లు 20 శాతానికి పెంచి అన్ని స్పెషలైజేషన్ కోర్సుల్లో అమలు చేయాలి, టైమ్ బౌండ్ ప్రమోషన్ల అమలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్‌పై 50 శాతం ప్రత్యేక భృతి, నోషనల్ ఇన్‌క్రిమెంట్లు మంజూరు, తదితర డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కానీ సరైన స్పందన లేదంటూ గత నెల 28వ తేదీ నుంచి సమ్మెకు దిగారు. దీంతో పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. వచ్చిన రోగులకు స్టాఫ్ నర్సులు తమ స్థాయిలో సేవలు అందించి మందులు ఇచ్చి పంపుతున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించింది. దీంతో సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, ఆయుష్ కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల్లో కొంతమందిని పీహెచ్‌సీలకు డిప్యూటేషన్‌పై నియమించారు. అయితే వీరిలో ఎక్కువమంది హోమియో, ఆయుర్వేద, యూనానీ వైద్యులు కావడంతో రోగులకు అత్యవసర అల్లోపతి వైద్య సేవలు అందడం లేదు. మరోవైపు సచివాలయాల పరిధిలో నిర్వహించే పత్యేక వైద్య శిబిరాలు ఆగిపోయాయి.

# తాండవకు వరద పోటు

### గెడ్డలు, వాగుల నుంచి 1,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు
- ప్రస్తుత నీటిమట్టం 377 అడుగులు
- మరో రెండు అడుగులు పెరిగితే స్పిల్ వే గేట్లు ఎత్తివేత



నిండుగా ఉన్న తాండవ జలాశయం

నాతవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్‌లోకి ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పలు గెడ్డలు, వాగుల నుంచి వరద నీరు పెద్ద ఎత్తున జలాశయంలోకి వచ్చి చేరుతున్నది. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకాగా, మంగళవారం 1,600 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో నీటిమట్టం 377 అడుగులకు చేరింది. ఆయకట్టుకు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 537 క్యూలసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. అవుట్ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో మూడురెట్లు అధికంగా వుండడంతో రిజర్వాయర్‌లో నీటినిల్వలు పెరుగుతున్నాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి, జలాశయంలోకి వరద పోటెత్తితే పూర్తి నిండే అవకాశం వుంది. నీటిమట్టం 379 అడుగులకు చేరితే స్పిల్‌గేట్లు ఎత్తి అదనపు నీటిని తాండవ నదిలోకి విడుదల చేస్తామని ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులనుబట్టి ఆయకట్టుకు నీటి కొరత ఏర్పడే అవకాశం లేదని అన్నారు. ఆయకట్టు చివరి భూములకు కూడా సకాలంలో నీరు అందుతుందని తెలిపారు.

# ఉపాధిలో అక్రమాలకు చెక్

### ముఖ ఆధారిత హాజరుకు కేంద్రం చర్యలు

- కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి
- పని ప్రదేశంలో రోజూ రెండుసార్లు ముఖ ఆధారిత హాజరు
- జిల్లాలో ఇంతవరకు 75 శాతం మేర నమోదు పూర్తి
- వచ్చే నెల నుంచి కొత్త విధానం అమలు?

కోటవురట్ల అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

**ఉపాధి హామీ పథకం పనుల్లో దొంగ మస్తర్లకు చెక్ పడనుంది. జాబ్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని, లేకపోతే వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఉపాధి పనులు చేయడానికి వీలుకాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రం ఆదేశాల మేరకు డ్వామా అధికారులు, జిల్లాలోని ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయిస్తున్నారు.**



కూలీల ఈకేవైసీ నమోదు చేస్తున్న ఉపాధి సిబ్బంది

గ్రామాల్లో పొలం పనులు లేనప్పుడు వ్యవసాయ కూలీలు వలస పోకుండా వుండడానికి సొంతూరునలోనే ఉపాధి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం సుమారు రెండు దశాబ్దాల క్రితం 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. గ్రామాల్లో వ్యవసాయ కూలీలే కాకుండా సన్న, చిన్నకారు రైతు కుటుంబాలకు కూడా ప్రభుత్వం జాబ్ కార్డులు జారీ చేసింది. ఏటా జనవరి నుంచి జూన్ వరకు చెరువులు, పంట కాలువల్లో పూడికతీత, కొండవాలు ప్రదేశాల్లో కాంటూరు కందకాల తవ్వకం వంటి పనులు చేయిస్తుంటారు. అయితే కొంతమంది అధికార, రాజకీయ పలుకుబడి ఉపయోగించి, ఉపాధి పనులకు వెళ్లకుండానే కూలి డబ్బులు పొందుతున్నారు. మరికొంతమంది వేరే ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ, సొంతూరులో ఉపాధి పనులకు వెళుతున్నట్టు మస్తర్లు వేయించుకుని డబ్బులు స్వాహా చేస్తున్నారు. మరికొన్నిచోట్ల ఉపాధి పథకం ఫీల్డు సిబ్బంది, ఉద్యోగులు కలిసి తప్పుడు మస్తర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారు. ఇటువంటి అక్రమాలు సామాజిక తనిఖీల్లో పెద్ద ఎత్తున బయటపడుతున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. జాబ్ కార్డుల్లో పేరున్న ప్రతి ఒక్కరికీ ఇకపై ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి. ఇందుకోసం ఈకేవైసీ చేయించాలని డ్వామా ... మిగతా 8వ పేజీలో

## 250 మందికి వైద్య పరీక్షలు



మందులందిస్తున్న కూటమి నేతలు కరణం రవి,గోపీ తదితరులు

ఎలమంచిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి యర్రవరం వార్డులో మంగళవారం సీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కరణం రవి తెలిపారు. వార్డులో ఇటీవల వైరల్ జ్వరాలు తీవ్రత కావడంతో స్థానిక ఎమ్మెల్యే విజయ్ కుమార్ చొరవతో సీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారన్నారు పలువురురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారన్నారు.పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ మోటూరు గోపీ, బీజేపీ పట్టణ ప్రతినిధి పిట్టా దాసుబాబు, సీహెచ్‌సీ. వైద్య సిబ్బంది, మాజీ కౌన్సిలర్ సియ్యాద్రి శ్రీను, టీడీపీ నేత సేనాపతి రాజా మహేశ్, ప్రగడ మహేష్, గొర్లె సత్తిబాబు, ఆశ వర్కర్లున్నారు

## విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన



అచ్యుతాపురంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్ స్టేషన్ వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖలో అధికంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులే పనిచేస్తున్నారు. కనీస వేతనాలు కూడా ఇవ్వటంలేదని అన్నారు. ఈకార్యక్రమంలో కె సోమునాయుడు, మోహన్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వెంకటాపురం సబ్‌స్టేషన్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. బుధవారం నుండి సమ్మెకు దిగుతామని గనిశెట్టి తెలిపారు. రామన్నదొర, కర్రి భాను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలికంగా బాంబు బ్లాస్టింగ్ నిలుపుదల



దుర్గానగర్ వాసులతో మాట్లాడుతున్న తహశీల్దారు ఎస్‌వి.మహేష్

పాయకరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): పాయక రావుపేట వద్ద జరు గుతున్న పోలవరం ఎడమ కాలువ బాంబు బ్లాస్టింగ్ పనులను తాత్కాలిం గా నిలిపివేస్తున్నట్టు తహశీల్దారు ఎస్వి. మహేష్ తెలిపారు. మంగళవారం దుర్గానగర్, దుర్గాకాలనీ ప్రాంతాల్లో టీడీపీ నాయకులతో కలిసి తహశీల్దారు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ బాంబు బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లకు నష్టం జరుగుతున్నందున హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించామన్నారు. త్వరలో హోం మంత్రి వచ్చి పరిస్థితిని పరిశీలించనున్నారని, ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, గూటూరు శ్రీనివాసరావు, రాజాన ఆది, జనసేన పార్టీ నాయకులు ఆచంట దొర తదితరులు పాల్గొన్నారు.

## బాంబు బ్లాస్టింగ్ పనుల్లో నిబంధనలు పాటించాలి

**▸▸ జనసేన నాయకుడు తోట నగేశ్**



తాండవ షుగర్స్ క్వార్టర్స్‌ని పరిశీలిస్తున్న తోట నగేశ్

పాయకరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా కొండను పగుల గొట్టేందుకు చేపడుతున్న బాంబు బ్లాస్టింగ్ పనుల్లో నిబంధనలు పాటిం చాలని జనసేన నాయకుడు తోట నగేశ్ అన్నారు. సోమవారం బ్లాస్టింగ్ కారణంగా తాండవ షుగర్స్ క్వార్టర్స్‌కి సమీపంలో రాయి తగిలి తలకు గాయమైన కార్మికుడు కర్రి శ్రీనుని మంగళవారం ఆయన పరామర్శిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరితగతిన పనులు చేయాలన్న ఉద్దేశంతో నిబంధనలు పాటించకుండా పనులు చేయడం తగదన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు రాకుండా చూసుకోవాలన్నారు. గాయపడిన కర్రి శ్రీను కంటికి ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి వచ్చినందున అతడికి నష్టపరిహారం ఇవ్వాలని తోట నగేశ్ డిమాండ్ చేశారు. అదేవిధంగా తాండవ షుగర్స్ క్వార్టర్స్‌తో పాటు దుర్గానగర్, దుర్గాకాలీలో పాడైన ఇళ్లకు నష్టపరిహారం అందజేయాలన్నారు. ఇది పనులు చేస్తున్న కాంట్రాక్టర్ ఇస్తారా లేక ప్రభుత్వం ఇస్తుందా అన్నది వారే తేల్చుకోవాలన్నారు. రెవె న్యూ శాఖ సర్వే చేసి జరిగిన నష్టానికి పరిహారం అందించిన తరువాతనే కాంట్రాక్టర్ తిరిగి బ్లాస్టింగ్ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

**▸▸ నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు**

పాయకరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):రసాయన పరిశ్రమల ఏర్పాటుతో సముద్రంలో మత్స్య సంపద తగ్గి జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీని కోరినట్టు జరిగిందని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బల్క్‌డ్రగ్ పార్కుపై మత్స్యకారులు నెల రోజులుగా ఆందోళన చేస్తున్నారన్నారు.రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో నాఫ్ కాకినాడ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఎస్.స్వామి, సూరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు, తదితరులు

# గూగుల్ ఒప్పందంపై టీడీపీ సంబరాలు



అచ్యుతాపురం జంక్షన్‌లో ర్యాలీ చేస్తున్న నాయకులు



పాయకరావుపేటలో సంబరాలు జరుపుకుంటున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాకతో రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో గూగుల్ ఒప్పందం జరిగిన సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా విశాఖలో 87 వేల కోట్లతో గూగుల్ డేటా సెంటర్ మొదటి దశ పూర్తయితే 1.8 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు. నక్కపల్లి మండలంలో స్టీల్‌ప్లాంట్, తదితర పరిశ్రమలు రాకతో లక్షలాది మంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు విశేష కృషిచేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీవిశ్వనాథం, వంకా వెంకటరమణ, చిక్కాల శ్రీను, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాసరావు, జనసేన నాయకులు ఆచంట దొర, నారపురెడ్డి పద్మ పాల్గొన్నారు.

**అచ్యుతాపురంలో..**

గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక జంక్షన్‌లో సంబరాలు జరిపారు. భారీగా బాణ సంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా దేశంలోనే తొలిసారిగా గూగుల్ హైపవర్ స్కేల్ డాటా సెంటర్‌కు సంబందించి ఒప్పందం చేసుకోవటం అభివృద్ధికి శుభపరిణామం అన్నారు. రా ష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి రాష్ట్ర ప్రజలు మరువలేనిదన్నారు. రాంబిల్లి మండలంలో దీని శాఖను ఏర్పాటు చేయటం ఈప్రాంతీయులకు వరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నీరుకొండ నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ లాలం రాజు, ధర్మిరెడ్డి సన్యాసి నాయుడు (బాబు): మేరుగు బాపునాయుడు, కూనిశెట్టి రమణ, పుర్రే శ్రీనివాస యాదవ్, కర్రి రమణ, మేరుగు వెంకటరావు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు

**▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్**



అగ్నికర్ పోస్టర్‌ని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించాలని, దీనికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రహదారులు, తాగునీరు, పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సాగునీటిపై కూడా రూపకల్పన చేయాలన్నారు. అనంతరం పీ4 సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా అచ్యుతాపురంలోని తన స్వగృహంలో అగ్నికర్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పసిపాప వైద్యానికి విశాఖ డైయిరీ ఛైర్మన్ చేయూత



వెల్చూరులో పాప కుటుంబీకులను పరామర్శించిన విశాఖ డెయిరీ ప్రతినిధులు

రాంబిల్లి, అక్టోబరు : 14 (ఆంధ్రజ్యోతి): నెలల పసిపాప తల్లిని కోల్పోయి అనారోగ్యానికి గురయింది. ఆ చిన్నారి వైద్యం కోసం విశాఖ డెయిరీ ఛైర్మన్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్ కుమార్ చేయూత అందించారు.. వివరాలివి.. మండలం వెల్చూరు గ్రామానికి చెందిన సూరిమల్ల నాగేశ్వరరావు, ప్రమీల దంపతులకు గత ఆగస్టు 28న పాప జన్మించింది. పాప పుట్టిన వెంటనే తల్లి ప్రమీల కోమాలోకి వెళ్లిపోయింది. సెప్టెంబరు 13న ఆమె వైద్యసేవలు పొందుతూ మృతి చెందారు. దీంతో పాపకు తల్లి పాలు, పోషకాలందక ఈ నెల 11న పసిపాప ఆరోగ్యం క్షీణించడంతో అనకాపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. పరీక్షించిన వైదులు మెరుగైన వైద్య కోసం సుమారు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో అంత స్తోమత లేక ఆ చిన్నారిని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలిసి విశాఖడైయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ స్పందించారు.ఆయన సూచనలపై చిన్నారికి ఆ ఆస్పత్రి వైద్యులు వైద్య మందించారు. విశాఖడెయిరీ అచ్యుతాపురం యూనిట్ మేనేజర్ పి.గురునాథరావు, ఎస్ఈజెడ్ జంగాలపాలెం పాల సంఘం అధ్యక్షులు బైలపూడి రామదాసు, గ్రామ నాయకులు కె.చినబాబు, డైయిరీ సూపర్ వైజర్ వై.భగవాన్ మంగళవారం వెల్చూరులో ఉన్న పాప కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## అయ్యప్ప స్వాముల భిక్షకు పింఛన్ సొమ్ము విరాళం

మునగపాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ రూ.4వేలను నిరుపేదయిన వృద్ధు పితాపురం దేవుడమ్మ అయ్యప్పస్వాములకు ఒక్కరోజు భిక్షకు విరాళమిచ్చి ఔదార్యం చాటుకున్నారు. స్థానిక అయ్యప్పస్వామి అలయం వద్ద 41 రోజులు నిర్వహించ తలపెట్టిన స్వామిలుంటున్నారు. ఒంటరి వృద్ధురాలైన దేవుడమ్మ ఎటువంటి ఆస్తులు లేకపోయినా భరోసా పింఛన్ అందించి పెద్ద మనస్సును చాటుకుంటోంది. కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు.

## వైద్య రంగ అభివృద్ధిలో విఫలం: వైసీపీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

మునగపాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనభాకు అనుగుణంగా వైద్య రంగం అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. స్థానిక ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి వైసీపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1923 నుంచి వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి వరకు కేవలం ఏపీలో 11 వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవన్నారు.. పేద విద్యార్థులు వైద్య కోర్సు పూర్తి చేయాలన్నదే మాజీ ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం అన్నారు. వైసీపీ యలమంచిలి సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ, వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడారు. జడ్పీటీసీ సభ్యుడుస్వామిసత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు గణపతి అచ్చింనాయుడు, బొద్దపు శ్రీరామ్మూర్తి, పాల్గొన్నారు.

## డ్రోన్ సాయంతో సాగు పనులు సులభతరం

మునగపాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖర్చు, సమయం ఆదాతో సాగు పనులకు డ్రోన్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని బీసీటీ సంస్థకు చెందిన పీడీ కేవీ సీతారామరాజు పేర్కొన్నారు. మండలంలో గణపర్తిలో మంగళవారం ఈ మేరకు అవగాహన కల్పించారు. ట్రైనర్ ప వన్‌కుమార్, రత్నాకుమార్, కూటమి నాయకులు కె.వి.రమణ, కె.చంద్రమోహన్‌లున్నారు.

## గంగమ్మకి మత్స్యకారుల పూజలు



రాజయ్యపేట తీరంలో గంగమ్మకు పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

నక్కపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట మత్స్యకారులు మంగళవారం తమ ఆరాధ్యదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట కేంద్రంగా మత్స్యకారులు చేస్తున్న ఉద్యమం మంగళవారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మత్స్యకార మహిళలు తమకు న్యాయం చేయాలని, బల్క్‌డ్రగ్ పార్కును ప్రభుత్వం రద్దు చేసేలా చూడాలంటూ గంగతమ్మకు, నూకతాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు,పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కొడవటిపూడిలో కొత్త టీచర్లకు ఘన స్వాగతం



కొడవటిపూడిలో కొత్త టీచర్స్‌ను ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోటవురట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మం డలం కొడవటిపూడి జిల్లాపరిషత్ పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యా యులకు విద్యార్థులు పూలు జల్లుతూ ఘన స్వాగతం పలికారు. మెగా డీఎస్సీలో ముగ్గురు నూతన ఉపాధ్యాయులు ఎస్.నర్సింగమూర్తి, ఎన్. నాగేశ్వరావు, శ్రీను హైస్కూల్‌కు రాగానే విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అనంతరం హెచ్ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో టీచర్స్ వారికి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

### బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ఆందోళన

రాంబిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కును మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు మంగళవారం మండలం గజిరెడ్డిపాలెంలోని మత్స్యకారులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సరికావదన్నారు. ఈ ప్రాంత మత్స్యకారులను జీవనాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు, స్థానిక మత్స్యకారులు ఎరిపల్లి రాము, నూకరాజు, చేపల కాసుబాబు, దావీద్ పాల్గొన్నారు.

### 'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

రాంబిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలల ప్రవేటీకరణ వ్యతిరేకిస్తూ మండవైసీపీ నాయకులు మంగళవారం రజాల, కు మ్మరాపల్లి, కట్టుబోలు, గోవిందపాలెం, కొట్టపేట గ్రామాల్లో కోటి సంతకా ల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబిల్లి మండల జడ్పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, వైసీపీ రాంబిల్లి మండలశాఖ అధ్యక్షులు పి.కిషోర్ మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

## రుద్రభూమి కోసం స్థల పరిశీలన

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో రుద్రభూమి కోసం తహశీల్దారు ఎస్‌వి మహేశ్వరరావు మంగళవారం తాండవ నది సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. ఆరు వేల జనాభా కలిగిన శ్రీరాంపురంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా జిల్లా అధికారులకు కూడా విన్నవించారు. ఈ విషయమై రాష్ట్ర హోం మంత్రి అనితకు వినతిపత్రం అందించి స్థలం మంజూరు చేయాలని కోరారు. ఇటీవల జరిగిన మండల సమావేశంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరుతూ తీర్మానం చేసి తహశీల్దారు, ఆర్డీవోలకు పంపించారు. గ్రామానికి చెందిన రైతు తాండవ నది సమీపంలో శ్మశానానికి భూమి ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ప్రభుత్వం నుంచి కొనుగోలు చేయడానికి ఆర్డీవో ఆదేశాల మేరకు మంగళవారం తహశీల్దారు మహేశ్వరరావు స్థలాన్ని పరిశీలించి రైతు వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించారు. రైతు వద్ద నుంచి అఫిడవిట్ తీసుకోవాలని సర్పంచ్ కృష్ణప్రసాద్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణప్రసాద్, టీడీపీ మండ ల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.శివకుమార్ పాల్గొన్నారు.



శ్రీరాంపురంలో రైతు పొలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు మహేశ్

## రీసర్వేను పరిశీలించిన నోడల్ అధికారి



రైతులతో మాట్లాడుతున్న అధికారి సూర్యారావు

అచ్యుతాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో రావిపాలెం, చీమలాపల్లిలో జరుగుతున్న రీసర్వే తీరును పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల రీసర్వే నోడల్ అధికారి కె. సూర్యారావు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి సర్వే బృందాలు రోజువారీ సర్వే నోటీసులు ముందుగా అందజేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. భూ డాక్యుమెంటేషన్ ఏవిధంగా జరుగుతున్నదో పరిశీలించారు. అనంతరం రోజువారీ షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం. వెంకన్న, తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ శ్యామ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం



మాట్లాడుతున్న క్రీడా కన్వీనర్ రాజు

ఎలమంచిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని మండల క్రీడా కన్వీనర్ కె. రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి పలు సూచనలు అందించారు. ఈ నెల 17 వ తేదీ నుంచి రెండు రోజులు నిర్వహించే మండల స్కూలు గేమ్స్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీలు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఎక్స్‌కవేటర్

**▸▸ ఐదు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం**

అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం వల్ల సోమవారం రాత్రి ఐదు గ్రామాల ప్రజలు అంధకారంలో ఉన్నారు. హరిపాలెం సమీపంలో రాత్రి సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తున్నారు. ఈ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఎక్స్‌కవేటర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో వైర్లు తెగిపడ్డాయి. దీంతో హరిపాలెంతో పాటు తిమ్మరాజుపేట, పెదపాడు, కాజీపాలెం జగ్గన్నపేటల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో ఏఈకి ఆయా గ్రామాల ప్రజలు పిర్యాదు చేయడంతో రాత్రికి రాత్రి కొండకర్లలోని లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, లైన్‌మేన్ సురేష్‌ల ఆధ్వర్యంలో అర్ధరాత్రి పనులు విద్యుత్ పనులు చేపట్టారు. తెల్లవారు మూడున్నర వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## యూరియా సరఫరా

మునగపాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం యూరియాతోపాటు రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందిస్తున్నట్టు టీడీపీ మండల నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మం డలంలో నాగులాపల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం యూరియా పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌తోపాటు ఇతర పంటలకు అనుగుణంగా ఎరువులు దిగుమతి అయ్యే విధంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అడ్వకేట్ ఇంట్లో చోరీకి విఫలయత్నం



ఇంట్లో క్లూస్ టీమ్ తనిఖీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో అడ్వకేట్ తళ్లా సత్యనారాయణ గృహంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఆయన ఎలమంచిలిలో వుంటున్నారు. నక్కపల్లిలో వున్న ఆయన ఇంటి తలుపులు తెరచి వున్నట్టు పొరుగింటివారు ఫోన్ చేసి చెప్పడంతో మంగళవారం ఉదయమే అడ్వకేట్ తళ్లా సత్యనారాయణ దంపతులు ఇక్కడకు చేరుకున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ఎస్ఐ విజయ్ ఆధ్వర్యంలో ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఇంట్లో విలువైన వస్తువులేవీ పోలేదని అడ్వకేట్ సత్యనారాయణ చెప్పారు. పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇద్దరు దొంగలు చోరీకి విఫలయత్నం చేసినట్టు గుర్తించారు.

## 23న కోటవురట్ల జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

కోటవురట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 23వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తునట్టు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు తెలిపారు. మంగళవారం జూనియర్ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహణకు ఏర్పాట్లను పరిశీలించారు. జాబ్‌మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు వస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని వారు సూచించారు.

## బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నక్కపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట, ఉపమాక, నక్కపల్లి, దేవవరం, వెంకటనగరం, రాజానగరం, దొండవాక, గుడివాడ లబ్ధిదారులకు మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను స్థానిక టీడీపీ నాయకులు అందజేశారు. హోం మంత్రి అనిత క్యాంపు కార్యాలయం వద్ద టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, నక్కపల్లి సొసైటీ ఛైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి లబ్ధిదారులకు రూ.3,88,331 సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కొలుకులూరి సురేశ్ వర్మ, టీడీపీ నాయకులు నానేపల్లి రాఘవులు, పెదపూడి శంకరరావు, అప్పలరాజు, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ విడుదల

ఎస్.రాయవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని హైస్కూల్లో ఈనెల 18వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్ మంగళవారం తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను స్థానిక వినయ్ స్కూలు కరస్పాండెంట్ వాసు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ స్కూలు స్థాయి, నవంబరు 1న మండల, నవంబరు 23న జిల్లా స్థాయి, డిసెంబరు 12,13,14 తేదీల్లో సైన్స్ సంబరాలు జరుగుతాయని చెప్పారు.

## ఆడపిల్లలను అన్ని విషయాల్లో ప్రోత్సహించాలి



తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తుమ్మపాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను అన్ని విషయాల్లో ప్రోత్సహించాలని తుమ్మపాల పీహెచ్‌సీ డిప్యూటీ హెల్త్ ఎడ్యూకేషన్ ఆఫీసర్ బి. మంగమ్మ అన్నారు. మంగళవారం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవ్ ది గర్ల్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలను చదివించడం ద్వారా సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఇల్లాలి చదువు..ఇంటికి వెలుగు అని విద్యార్థినులంతా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## సీజేఐపై దాడికి నిరసనగా సీఐటీయూ ఆందోళన




కార్యకర్తలతో కలిసి ఆందోళన చేపడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

పరవాడ (లంకెలపాలెం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం లంకెలపాలెం జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సీజేపై దాడి అత్యంత హేయమైనదన్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ వ్యక్తిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె. వెంకటరావు, పెంటారావు, రమణ, అప్పారావు, సత్తిబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ వెంకటఫణిబాబుకు అవార్డు




ప్రొఫెసర్‌ను అభినందించిన రత్నాకర్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అంతర్జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును డైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వి. వెంకటఫణిబాబు అందుకున్నారు. విజయవాడలో సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి, పలు దేశాల నుంచి రెండు వేల మంది ప్రొఫెసర్లు హాజరయ్యారు. ఈ అవార్డును ఏపీసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారి బుద్ద చంద్రశేఖర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు చేతుల మీదుగా వెంకటఫణిబాబు అందుకున్నారు. దీంతో మంగళవారం దాడి విద్యాసంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ అవార్డు అందుకున్న ఫణిబాబును అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, అధ్యాపకులు అవార్డు గ్రహీతను అభినందించారు.

## చెకుముకి గోడపత్రిక ఆవిష్కరణ



చెకుముకి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు దివాకర్‌రావు, సాయిశైలజ తదితరులు

పరవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను ఎంఈవోలు ఎం.దివాకర్‌రావు, జి.సాయిశైలజా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఈనెల 18న, మండల స్థాయిలో నవంబరు ఒకటిన, జిల్లా స్థాయిలో నవంబరు 23న, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 12, 13, 14 తేదీల్లో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధి పీఎస్ మూర్తి, యూటీఎఫ్ నాయకులు బి.శ్రీలక్ష్మి, ఎం.రామునాయుడు, సుభాషిణి దేవి, మనోరంజని, వేదుల అప్పారావు, బంగార్రాజు పాల్గొన్నారు.

## స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులపై విద్యార్థులకు అవగాహన




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఐఎస్ఎం ట్రైనర్ శ్రీనివాసరావు

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ (ఎన్ఐఎస్ఎం) ట్రైనర్ ఎం.శ్రీనివాసరావు పెట్టుబడులు ఏవిధంగా పెట్టాలో వివరించారు. కొటక్ సెక్యూరిటీస్ సంస్థ సీఎస్ఆర్ అందజేసిన మెటీరియల్‌ను పంపిణీ చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శంకర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, వాణిజ్య విభాగాధిపతి ఎం.గోవిందరావు, అధ్యాపకులు వి.రజని, ఎల్. గణేశ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# కంపుకొడుతున్న కృష్ణాపురం కాలనీ

- కాలువలు లేక రోడ్డుపైనే నిలిచిపోతున్న వాడుక నీరు
- వర్షం వస్తే ఇళ్లల్లోకి చేరుతున్న మురుగు

కొత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం కాలనీ మురికికూపంగా మారింది. కాలనీలో రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోవడంతో కంపుకొడుతోంది. రోడ్డుకిరువైపులా కాలువలు లేకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ కాలనీ అభివృద్ధి చేయకపోవడం అన్యాయమని వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోలేదని, కనీసం కూటమి ప్రభుత్వంలోనే తమ సమస్యను పరిష్కరించి అనారోగ్యాల బారిన పడకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు. అంతేగాకుండా వర్షపునీరు, మురుగునీరు రోడ్డుపై నిలిచిపోకుండా రోడ్డుకిరువైపులా కాలువలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రోజుల తరబడి ఉన్న చెత్త



కాలనీలో నాచుపట్టిన మురుగునీరు

### ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలి

పంచాయతీలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టడం లేదు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోతోంది. దీనివల్ల పేరుకుపోయిన చెత్తను పందులు చిందరవందర చేస్తున్నాయి. ఈ చెత్త రోడ్డుపైకి వస్తున్నదని స్థానికుల తెలిపారు. అంతేగాకుండా పందుల బెడద ఎక్కువ కావడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందన్నారు. వీటి కారణంగా కాలనీలో ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, జ్వరాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కృష్ణాపురం కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## బాల్య వివాహ యత్నానికి బ్రేక్

- స్థానికుల సమాచారంతో గ్రామానికి వెళ్లిన చైల్డ్ వెల్ఫేర్ అధికారులు
- బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

కొత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామంలో బాల్య వివాహ ప్రయత్నాన్ని చైల్డ్ వెల్ఫేర్ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. మూలపేటలో 16 ఏళ్ల బాలికకు 24ఏళ్ల యువకుడుతో వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. అయితే ఈ సమాచారాన్ని స్థానికులు చైల్డ్ హెల్ప్‌లైన్-1098కు అందించారు. దీంతో చైల్డ్ వెల్ఫేర్, ఐసీడీఎస్, అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామానికి వెళ్లి బాలిక, తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించారు. అంతేగాకుండా నీలకంఠపురం గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడితో వచ్చే నెలలో జరిగే వివాహ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అధికారులు సూచించారు. అయితే 18 ఏళ్లు నిండిన తరువాతే బాలికకు వివాహం చేస్తామని తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాన్ని తీసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి బాలిక తల్లిదండ్రులను పిలిపించి బాల్య వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, విశాఖపట్నం, అనకాపల్లి డీసీపీయూ కౌన్సిలర్ షేక్ బాను, అంగన్‌వాడీ కార్యకర్త సత్యవతి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం డి.రామలింగేశ్వరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ వి.గౌరీనాయుడు, కార్యదర్శి కవిత, షేక్ రేజియన్, కె.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు గంబూషియా చేపలు పెంచాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హైమావతి



కొత్తూరు చెరువులో గంబూషియా చేపలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

కొత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు గంబూషియా చేపల పెంపకం అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హైమావతి అన్నారు. మంగళవారం స్థానిక చెరువులో గంబూషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జ్వరాల విజృంభించకుండా ఉండేందుకు ప్రతి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య, వైద్య సిబ్బంది అందరూ గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా ఉండేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వరహాల దొర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సైనిక లాంఛనాలతో సీఆర్‌పీఎఫ్ ఉద్యోగికి అంత్యక్రియలు



సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి మృతదేహానికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం

కొత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతి చెందిన అనకాపల్లి మండలం కుంచంగి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి చిన్ని శ్రీనివాసరావు (51) అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. మంగళవారం ఉదయం కుంచంగి గ్రామానికి సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు మృతదేహాన్ని తీసుకువచ్చారు. శ్రీనివాసరావు స్వగృహం వద్ద కొంతసేపు ఉంచి అనంతరం శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్మశానవాటిక వద్ద మృతదేహంపై జాతీయ జెండాను కప్పి, సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పశువైద్య శిబిరాలను సద్వినియోగపరుచుకోండి

### ఉమ్మడి విశాఖ జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ చంద్రశేఖర్

పరవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న గాలికుంటువ్యాధి నిరోధక టీకాల పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగపరుచుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ మోపాడ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఆయన భరణికంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పశువైద్యశిబిరాన్ని సందర్శించారు. పశువులకు ఎంతమేర టీకాలు వేశారో అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రావాడలో గల రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వాడచీపురుపల్లి పశువైద్యకేంద్రంలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట పరవాడ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కీర్తి రామకృష్ణ, పశువైద్యాధికారి సురేష్‌కుమార్, సిబ్బంది కళ్యాణి, లక్ష్మణ్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రావాడలోని రికార్డులను పరిశీలిస్తున్న ఉప సంచాలకులు మోపాడ చంద్రశేఖర్

## బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ ప్రారంభం




సమావేశంలో మాట్లాడుతున్న జీసీఎం గోవింద నారాయణ్ గోయన్

కొత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని అగ్రికల్చర్ అండ్ గవర్నమెంటు స్పాన్సర్ స్కీం (జీఎస్ఎస్) ముంబై కార్పొరేట్ సెంటర్ జీసీఎం గోవింద నారాయణ్ గోయన్, అమరావతి డీజీఎం డీబీఎల్ మాణిక్యాంబ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీవో అనకాపల్లి రీజనల్ మేనేజర్ మహాపాత్ర, కె.రమేష్, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఎల్‌వోలకు శిక్షణ

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో మంగళవారం బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వో)కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో పి. పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల డీటీ వి. అర్జునరావు మాట్లాడుతూ.. బీఎల్‌వోల విధులు, బాధ్యతలు గురించి వివరించారు. ఎన్నికల కమిషన్ తెలిపిన ప్రతి సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు, తొలగింపులు, చేర్పులు, మార్పులు గురించి వివరించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ వి జాన్‌ప్రశాంత్ పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ.. బీఎల్‌వోల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎన్నికల ఆర్ఐ రవి, పలువురు వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పెందుర్తి నియోజకవర్గ ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ వి అర్జునరావు

## మ్యాన్‌హోల్‌తో పొంచి ఉన్న ముప్పు

పరవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :

పరవాడ బీసీ కాలనీ నుంచి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైపు వెళ్లే ప్రధాన మార్గంలో సీసీ రహదారికి ఆనుకొని ఉన్న మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. కాలనీవాసులు, విద్యార్థులు, వాహనదారులు పీహెచ్‌సీ ప్రధానరోడ్డుకు వెళ్లే వారంతా నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. తాగునీటి పైప్‌లైన్‌కు చెందిన మ్యాన్‌హోల్ తుప్పల చాటున ఉండడంతో పాటు మూత లేకపోవడంతో దగ్గరకు వెళ్లే వరకు కనిపించడం లేదు. ముఖ్యంగా రాత్రుల సమయంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

దీని కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని అటుగా రాకపోకలు సాగించే వారంతా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే నాథుడే లేకపోయారు. పంచాయతీ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



రహదారిని ఆనుకొని పొదల మాటున ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

## 'వడ్డే శోభనాద్రీశ్వరరావుపై పోలీసుల చర్య సరైనది కాదు'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా అడ్డతీగలో ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావుపై పోలీసులు తీసుకున్న చర్య సరైనది కాదని రైతు స్వరాజ్యవేదిక రాష్ట్ర కో-కన్వీనర్ గాడి బాలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిందాల్‌కు వ్యతిరేకంగా 113 రోజులుగా ప్రజలు శాంతియుతంగా ఉద్యమాన్ని చేస్తున్న వారికి సంఘీభావం తెలపడానికి వెళ్లిన వడ్డే శోభనాద్రీశ్వరరావు పట్ల పోలీసులు ప్రవర్తన తీరు హేయమైనదన్నారు. శాంతియుత పోరాటానికి సంఘీభావం తెలపడానికి వడ్డే శోభనాద్రీశ్వరరావు వెళ్లనీయకుండా నడిరోడ్డుపై అడ్డగించడాన్ని ఆయన ఖండించారు.

## 'పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి'

తుమ్మపాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం అనకాపల్లి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పాఠశాలల్లో మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మరుగుదొడ్ల పరిసర ప్రాంతాలు పారిశుధ్యం లోపించి రోత పుట్టిస్తున్నాయన్నారు. తక్షణమే విద్యాశాఖాధికారులు స్పందించి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై అవగాహన

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆయుర్వేదిక్ వైద్యశాలలో సీపీఆర్ (కార్డియో పల్మోనరీ రిససిటేషన్)పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేదిక్ వైద్యురాలు కె. లావణ్య మాట్లాడుతూ సీపీఆర్ అంటే ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకొని ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర ప్రథమ చికిత్స అని అన్నారు. సీపీఆర్ గురించి వీడియో వీక్షణ ద్వారా, డెమో ద్వారా హాజరైన రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

- పరవాడ సీఐ మల్లికార్జునరావు



పరవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో బాణసంచా వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు స్పష్టం చేశారు. అనుమతులు తీసుకోకుండా ఎవరైనా బాణసంచా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేయడం, విక్రయించడం, నిల్వ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అన్ని ప్రాంతాల్లో పోలీస్ నిఘా పెట్టామన్నారు. విక్రయదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ మల్లికార్జునరావు అన్నారు.

## గొల్లలపాలెం గెడ్డ స్థలంలో హెచ్చరిక బోర్డు



గెడ్డ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ వీరయ్య తదితరులు

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 249 గెడ్డవాగులో మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈనెల 12న 'ఆంధ్రజ్యోతి'లో 'ఆక్రమణదారుల బరితెగింపు' గెడ్డ వాగు స్థలాల ఆక్రమణ శీర్షికన ప్రచురితమైన కథనానికి తహశీల్దార్ బి.చిన్నికృష్ణ స్పందించారు. ఈ మేరకు మంగళవారం సర్వే చేసి గెడ్డ వాగు సర్వే 249 నంబరులో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. హెచ్చరిక బోర్డు ఎవరైన తొలగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రామాపురంలో 170 మందికి ఉచిత వైద్య పరీక్షలు

కొత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ రామాపురంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాస్టర పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోన శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గొబ్బూరులో పది మద్యం బాటిళ్లు స్వాధీనం

కశింకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొబ్బూరు గ్రామంలో బెల్టు షాపులో పోలీసులు మంగళవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పది మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ అల్లు స్వామినాయుడు చెప్పారు. కాగా, బెల్టుషాపు నిర్వహిస్తున్న రాజస్థాన్ ప్రాంతానికి చెందిన దయాచందుపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై బయో రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ

కశింకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, బయో రిసోర్స్‌పర్సన్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే కషాయాలు, ద్రావణాలు తయారీపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి సీహెచ్ లచ్చన్న శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సత్తిరాజు, సిబ్బంది డి.రమణ, గంటా వెంకట అప్పారావు, రామ గోవింద తదితరులు పాల్గొన్నారు.

# విశాఖకు గూగుల్ సెంటర్ రాకపై హర్షాతిరేకాలు

నర్సీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రాకతో పట్టణంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. మంగళవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు క్యాంప్ కార్యాలయం వద్ద టీడీపీ శ్రేణులు, యువకులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. భారీ ప్రాజెక్ట్ తీసుకురావడంలో విశేష కృషి చేసిన నారా లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. గూగుల్ డేటా సెంటర్‌తో ప్రత్యక్షంగా పరోక్షంగా ఉత్తరాంధ్ర జిల్లాలలో 1.88 లక్షల ఉద్యోగ అవకాశాలు రానున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా గూగుల్ హైపవర్ స్కేల్ డాటా సెంటర్‌కు సంబంధించి ఒప్పందం చేసుకోవ


స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద సంబరాలు

టం అభివృద్ధికి శుభపరిణామం అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి రాష్ట్ర ప్రజలు మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు లాలం మురళీ, కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, నల్లబెల్లి స్వామి పాల్గొన్నారు.

### 62 గోకులాల షెడ్లు మంజూరు

మాకవరపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలానికి 62 గోకులాల షెడ్లు మంజూరైనట్టు స్థాన ఎంపీడీవో సాయిసుధ తెలిపారు. ఇటీవల 31 పంచాయతీల నుంచి గోకులాల షెడ్ల నిర్మాణాలకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 62 దరఖాస్తులు ఆమోదం లభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కాశీ పాల్గొన్నారు.

### ఆక్రమణలు తొలగించాలి


తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు, రైతులు

మాకవరపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న సాగునీటి కాలువల్లో ఆక్రమణలను తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై. పాత్రుడు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తహశీల్దార్ జి.వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రుడు మాట్లాడుతూ మండలంలో ఆరు సాగునీటి కాలువల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయన్నారు. వీటిలో ఆక్రమణల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జాజిగెడ్డ సాగునీటి కాలువ, లచ్చన్నపాలెం, బూరుగుపాలెం చానల్, లచ్చన్నపాలెం పిరుకుమదం కాలువ, పల్లపు కాలువ, పైడిపాల చానల్, కోమరవోలు రిజర్వాయర్ నుంచి తూటిపాల మీదుగా తాడపాలకు వచ్చే కాలువలు ఆక్రమణల వల్ల ఆయకట్టు పొలాలకు సాగునీరందడంలేదన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపునకు గ్రామాల్లో సాగునీటి సంఘం అధ్యక్షులు దండోరా వేయించాలన్నారు. అనంతరం సర్వే చేయించి ఆక్రమణలు తొలగించి , మరమ్మతులకు సహకరిస్తామన్నారు.

### దోమల నివారణకు చర్యలు


పాడుబడిన బావిలో గంబూషియా చేపపిల్లలు విడుదల వైద్య సిబ్బంది

గొలుగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో దోమల నివారణకు పాడుబడిన బావులు, చెరువుల్లో గంబూసియా చేపపిల్లలు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ పకీరునాయుడు మాట్లాడుతూ గొలుగొండ పీహెచ్‌సీ పరిధిలో పాతమల్లంపేట, గొలుగొండ, కొత్తఎల్లవరం, పాకలపాడు, జోగంపేట, చీడిగుమ్మల గ్రామాల్లో దోమల ఉత్పత్తి తగ్గించేందుకు ఈ చేపలను విడుదల చేశామన్నారు. ఇవి దోమల గుడ్లను నాశనం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, గెడ్డం ఆనంద్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### జాబ్ మేళాలో 42 మంది ఎంపిక

నర్సీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎంఎల్ఎస్ డిగ్రీ కళాశాలలో దివీస్ ల్యాబొరేటీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలలో 42 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మంగళవారం కళాశాల ఆవరణలో 76 మంది నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి 42 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కరాస్పాండెంట్ మీసాల శ్రీలక్ష్మయ్య, చైర్మన్ మీసాల సుబ్బన్న, ప్రిన్సిపాల్ తాతబ్బాయి పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి తహసీల్దారుగా రామారావు



గొలుగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారుగా రామారావు బాధ్యతలు మంగళవారం చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావు గత నెలలో పదవీవిరమణ చేయడంతో నర్సీపట్నంలో పనిచేస్తున్న రామారావుకు గొలుగొండ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ, విద్యార్థులకు అవసరమగు ధ్రువపత్రాల జారీతోపాటు రెవెన్యూ సేవలకు నిరంతరం అందుబాటులోఉంటానన్నారు.



**NARSIPATNAM MUNICIPALITY**
**TENDER NOTICE**

Roc.No.448/2020/E1 Dated 13.10.2025

Narsipatnam Municipality inviting the following Tenders on 'e'-procurement Platform under 15th FC Grant, VMRDA Grant, DMFT Grant & Municipal General Funds

| Sl. No. | Grant Name and No. of Works | Tender Call | Total Value | Download Starting Date & Time | Download Ending Date & Time |
|---|---|---|---|---|---|
| 1. | 16 Works (VMRDA Grant) | 2nd Call | Rs.62.70 Lakhs | 14-10-2025 by 11.00 A.M. | 27-10-2025 by 4.30 P.M. |
| 2. | 01 Work (DMFT Fund) | 6th Call | Rs.1.00 Lakh | 14-10-2025 by 11.00 A.M. | 21-10-2025 by 4.30 P.M. |
| 3. | 01 Work (VMRDA Grant) | 7th Call | Rs.9.60 Lakh | 14-10-2025 by 11.00 A.M. | 21-10-2025 by 4.30 P.M. |
| 4. | 04 Works (15th FC Grant) | 4th Call | Rs.5.75 Lakh | 14-10-2025 by 11.00 A.M. | 21-10-2025 by 4.30 P.M. |
| 5. | 02 Works (General Fund) | 2nd Call | Rs.8.40 Lakh | 14-10-2025 by 11.00 A.M. | 27-10-2025 by 4.30 P.M. |
| 6. | 03 Works (General Fund) | 3rd Call | Rs.7.50 Lakhs | 14-10-2025 by 11.00 A.M. | 21-10-2025 by 4.30 P.M. |
| 7. | 07 Works (General Fund) | 5th Call | Rs.15.55 Lakhs | 14-10-2025 by 11.00 A.M. | 21-10-2025 by 4.30 P.M. |
| 8. | 02 Works (DSA Grant) | 1st Call | Rs.7.60 Lakhs | 14-10-2025 by 11.00 A.M. | 21-10-2025 by 4.30 P.M. |
| 9. | 02 Works (General Fund) | 1st Call | Rs.6.75 Lakhs | 14-10-2025 by 11.00 A.M. | 21-10-2025 by 4.30 P.M. |
| 10. | 01 Work (General Fund) | 1st Call | Rs.3.00 Lakhs | 14-10-2025 by 11.00 A.M. | 27-10-2025 by 4.30 P.M. |

For details logon to https://tender.apeprocurement.gov.in/
Contact Ph. No. **9494189575, 7702495544.**

Sd/- **J.SURENDRA**
Commissioner
Narsipatnam Municipality

# కన్నులపండుగగా నల్లగొండమ్మతల్లి జాతర

నాతవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి. యర్రవరం గ్రామంలో మంగళవారం నల్లగొండమ్మతల్లి జాతర కన్నుల పండుగగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు క్యూలో నిలుచుని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో తాడేపల్లి వారి శక్తివేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారిని గుర్రాల రథంపై వీధులలో ఊరేగించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చి కళాకారులతో భారీస్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే జాతర సందర్భంగా రాష్ట్రస్థాయి గుర్రాల పోటీలను ఉత్సవకమిటీ ఏర్పాటు చేసింది. ఈ పోటీల్లో 40 గుర్రాలు పాల్గొన్నాయి. అచ్యుతపురం మండలం రామన్నపాలెంనకు చెందిన చోడ మాబింక గుర్రానికి ప్రథమస్థానం, అనకాపల్లి మండలంనకు మణికంఠ గుర్రానికి ద్వితీయస్థానం, కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన రాకీ బ్రదర్స్‌కు తృతీయస్థానం వచ్చాయి. ఈ పోటీలో ప్రథమ స్థానానికి 15వేల నగదు షీల్డు, ద్వితీయస్థానం వచ్చిన రూ. 12వేలు, తృతీయస్థానం వచ్చిన గుర్రం యాజమానికి 10వేల నగదు షీల్డు అందజేశారు.


స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద సంబరాలు


జాతరలో ఆకట్టుకున్న తాడేపల్లివారి శక్తివేషాలు




## అవంతిలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నర్సీపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాల నూతన విద్యారంభ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం నర్సీపట్నం స్టార్‌హోమ్స్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాలలో చేరిన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల అధిపతి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రాంగణం ర్యాగింగ్ రహితంగా ఉండాలని సూచించారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు సోదర భావంతో మెలగాలన్నారు. కొత్త ఆవిష్కరణలు చేస్తే గుర్తింపు వస్తుందని అన్నారు. ప్రొఫెసర్ చంద్రభూషణరావు మాట్లాడుతూ జూనియర్లలో భయాన్ని పోగొట్టేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విశాఖపట్నం 13వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లో చేరి దేశ సేవలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకలో విద్యార్థులు సినిమా పాటలకు డ్యాన్సులు చేసి అలరించారు. డీటీఎస్ రమేశ్ మిమిక్రీ విద్యార్థులను ఆలరించింది. వాలీబాల్, ఖోఖో వంటి ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహనరావు, సెక్రటరీ ఎం.ప్రియాంక, ఐ.శ్రావణ్‌కుమార్, ఎంవీఎస్ నందీష్, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి శృతి తదితరులు పాల్గొన్నారు.


సినిమా పాటలకు డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

## ఆడపిల్లల సంరక్షణపై శ్రద్ధ వహించాలి

గొలుగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల సంరక్షణపై పలు గ్రామాల్లో మంగళవారం వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తఎల్లవరం హైస్కూల్లో ఏర్పాటైన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డి. సత్యవతి మాట్లాడారు. బాలబాలికలకు ప్రత్యేక క్లీనిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లింగ నిర్ధారణ జరగకుండా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. బాలబాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగేందుకు తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని వివరించారు. ఈ నెల 17వ తేదీ వరకు ఈ అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కరుణానిధి, వైద్య సిబ్బంది


కొత్తవరం హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం

## విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట అక్టోబర్14 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలో గల పలు పాఠశాలల్లో నూతన ఇటీవల డీఎస్సీ లో భాగంగా , ఎంపికైన వారు విధుల్లో చేరినట్టు మండల విద్యాశాఖ అధికారి కాశీ విశ్వేశ్వరరావు, తెలిపారు. 31 పోస్టులకు గాను , 26 మంది స్కూల్ ఆసిస్టెంట్లు, సెకండరీ పాఠశాలల ఉపాధ్యాయులు విధుల్లో చేరిన వారిలో ఉన్నారన్నారు. వీరికి ఆయా గ్రామాలకు కేటాయించినట్టు తెలిపారు.



## గంజాయితో నలుగురి అరెస్టు


పోలీసులు ఆదుపులో నిందితులు

నాతవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చమ్మచింత జంక్షన్‌లో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఆదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు వీరి వద్ద నుండి ఒక కిలో లిక్విడ్ గంజాయి, లూజు గంజాయి 5 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు బైక్‌లు నాలుగు సెల్‌ఫోన్‌లు కూడా సీజ్ చేసినట్టు చెప్పారు. నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నర్సీపట్నం సీఐ రేవతమ్మ సూచనలతో వీరిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

## చెత్తకు నిప్పుతో అవస్థలు


పోలీసులు ఆదుపులో నిందితులు

మాకవరపాలెం అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెంలో రహదారులపై చెత్తకుప్పలు ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ చెత్త కుప్పలు కుళ్లి తీవ్ర దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ చెత్తకు కొంతమంది నిప్పుపెట్టడంతో దాని నుంచి వస్తున్న పొగవల్ల సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. పొగతో గర్భిణీస్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రహదారులపై ఉన్న చెత్తను తొలిగించాలని కోరుతున్నారు.

## పారిశుధ్య పనులు


ఏఎల్ పురంలో చెత్త తొలగిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం పారిశధ్య పనులు చేపట్టారు. గొల్లవీధి రహదారిలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగించి గ్రామ శివారుకు తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

» ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి

జి.మాడుగుల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారం వల్లే శిశువుకు, తల్లికి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీపీ పీడీ సీహెచ్ ఝాన్సీబాయి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవంలో ఆమె మాట్లాడుతూ ఆకు కూరలు, పండ్లు తినడం వల్ల రక్తహీనత నివారించవచ్చని నివారించవచ్చునని, వ్యాధి నిరోధక శక్తి పేరుగుతుందని పేర్కొన్నారు. ఉప్పు, కారం, చక్కెర వాడకం తగ్గించాలని సూచించారు. బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్‌కుమార్, సర్పంచ్ రాంబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు ప్రారంభం




కోడిగెడ్డ వంతెన వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

అరకులోయ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యండపల్లి వలస- అరకు గ్రామాలకు మధ్య ఉన్న అప్రోచ్‌రోడ్డుకు మరమ్మతులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. కోడిగడ్డ వంతెనను ఆనుకుని ఉన్న ఈ రోడ్డులో కొంత భాగం గెడ్డలోకి జారిపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. దీనిపై పలుమార్లు పత్రికల్లో వార్తలు రావడంతో జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు మర్మమతులకు రూ.10 లక్షల కేటాయించి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాణ్యత తగ్గకుండా చూసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను పలువురు స్థానికులు కోరుతున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

» అరకు సీఐ హిమగిరి



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నిడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని అరకు సీఐ హిమగిరి హెచ్చరించారు. మండలంలోని చాపారాయి సమీపంలో జాతీయ రహదారి వద్ద ఎస్ఐ పాపినాయుడుతో కలిసి మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారలుకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. అనంతరం వాహనదారులతో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించి పత్రాలు ఎప్పుడూ వెంట ఉంచుకోవాలని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా రెండవ జాతీయ సెమినార్

చింతపల్లి, అక్టోబరు 14 , (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రెండవ జాతీయ సెమినార్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి అధ్యక్షత వహించారు. సెమినార్‌లో ప్రధాన అంశంగా దేశాన్ని పరివర్తనం చేయడం, ఆవిష్కరణలు, సవాళ్లు, అనే అంశాలపై పరిశోదన పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రయూనివర్సిటీ ప్రొఫెసర్లు కె.కనకకుమారీ చాంద్, కేవీకే చాంద్, పరిశోదన పత్రాలను పరిశీలించారు. అనంతరం సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను విద్యార్థులతో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఎం ఉష, కో-ఆర్డినేటర్ వి.రమణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస పాత్రుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వనదుర్గ ఆలయంలో అన్న సమారాధన

సీలేరు, అక్టోబరు 14 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు వన దుర్గ ఆలయంలో మోటారు అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన మంగళవారం ఏర్పాటు చేశారు. ఏటా దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఈ ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యే పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

## బీఐఎస్ ఉత్తమ మెంటార్‌గా ప్రసాదరావు

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ (బీఐఎస్) కార్యక్రమాలను విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు వరల్డ్ 'స్టాండర్డ్ డే' సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ అధ్యాపకుడు పల్లల ప్రసాద్‌రావుకు బీఐఎస్ ఉత్తమ మెంటార్‌గా అవార్డును అందించారు. గుంటూరు ఎల్‌కే యూనివర్సిటీలో జ్ఞాపికను, సర్టిఫికేట్‌ను మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం. సల్లంగి విశ్వప్రసాద్ మాట్లాడుతూ తమ పాఠశాల అధ్యాపకుడికి అవార్డు లభించడం తమకెంతో ఆనందంగా ఉన్నదని తెలిపారు. ప్రతి వస్తువు నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని , ఐఎస్ఐ మార్క్ ఉండే వస్తువులు కొనుగోలు చేయాలని అన్నారు. ఇంట్లో నాణ్యమైన వస్తువులు వాడడం ఎంతో అవసరమన్నారు.

## నడిమివీధిలో కార్డెన్ సెర్చ్

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చింతల వీధి పంచాయతీకి చెందిన నడిమి వీధి గ్రామంలో జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు స్పెషల్ పార్టీ పోలీసుల సహకారంతో కార్డెన్ సెర్చ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న 150 గృహాలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడుతూ ఇతర రాష్ట్రల నుంచి వచ్చిన వారు వ్యాపామనే ముసుగులో గంజాయి రవాణా చేస్తున్నారని వారితో జాగ్రత్తగా ఉండాలి సూచించారు. ఇతర రాష్ట్రల నుంచి వచ్చిన వారిపై పూర్తి నిఘా ఉంచామని తెలిపారు.

## 8 గ్రామాల్లో అంధకారం

గూడెంకొత్తవీధి, అక్టోబరు 14 , (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాము అంధకారంలో గడుపుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గాలికొండ, జంపర్లోవ, బత్తునూరు, బూసుకొండ, బూడిదేవేలు, పాత్రునిగుంట, పాలసెలక ఎనిమిది గ్రామాలకు ఆదివారం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లైన్‌మేన్‌కు చెప్పినా పట్టించుకోలేదని వారు వాపోయారు.

# ఘాట్‌రోడ్డులో ప్రయాణమంటే హడల్



మలుపువద్ద ప్రమాదకరంగా మారిన ఎండిన చెట్టు



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న స్థానిక యువకులు

» చెట్లు ఎప్పుడు విరిగి పడతాయో తెలియక హడలిపోతున్న వాహనదారులు

» ఎండిన, ఒరిగిన చెట్లను తొలగించాలని అధికారులను కోరుతున్న స్థానికులు

అనంతగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌రోడ్డులోని ఆకస్మాత్తుగా విరిగిపడుతున్న చెట్ల కారణంగా అదృష్టం బాగుంటే ప్రమాదాలు నుంచి బయపడుతున్నారు. లేదా ఆ ప్రమాదాలకు బలి కావల్సి వస్తోంది. ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షాలకు, వీస్తున్న ఈదురు గాలులకు ఘాట్‌రోడ్డులోని చెట్లు విరిగి పడుతున్నాయి. దీంతో వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు తపడ్డం లేదు. ఒక్కో సారి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

### ఎండిన చెట్లతో మరింత ప్రమాదం

ఘాట్‌రోడ్డులోని ఎండిన చెట్లు, గాలికి రోడ్డు వైపు ఒరిగిపోయిన చెట్లు కోకోల్లలుగా దర్శనమిస్తున్నాయి. ఈదురు గాలులతో వర్షాలు వచ్చినప్పుడు ఇవి మరింత ప్రమాదంగా మారుతున్నాయి. ఎప్పుడు ఏ చెట్టు కూలుతుందోనని వాహనదారులు హడలిపోతున్నారు. అనంతగిరి మండలంలోని శివలింగపురం ఘాట్‌రోడ్డు నుంచి అరకు వరకు చాలా చెట్లు రోడ్డును ఆనుకుని ఉన్నవి. భారీ వర్షాలు మట్టి కోసుకుపోయి చెట్లు వేర్లతో సహా కూలిపోతున్నాయి. ఆ సమయంలో వాహనాలు అటు పోకుండా ఉంటే ప్రమాదం జరగడం లేదు. ఒకవేళ చెట్టు పడే సమయంలో వాహనాల్లో ఎవరైనా ఉండి ప్రమాదం ఉంచి బయట పడితే వారి అదృష్టం బాగుందని అనుకోవాలి.

### తప్పిన పెను ప్రమాదం

దసరా పండగరోజు ములియగుడ సమీపంలోని ప్రసాద్‌గార్డెన్స్ మలుపువద్ద కాంగుచెట్టు విరిగిపడిన ఘటనలో కారు, ఆర్టీసీ బస్సు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాయి. చెట్టు పడే సమయంలో క్షణాల్లో రెండు వాహనాలు దాటిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

### లారీపై విరిగిపడిన చెట్టు

రెండేళ్ల క్రితం అరకువైపు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న లారీపై అనంతగిరి పీహెచ్‌సీ సమీపంలోని చెట్టు విరిగిపడడంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్, క్లీనర్ గాయలపాలైయ్యారు. ఆకస్మాత్తుగా చెట్టు విరిగిపడిన ధాటికి రిటేయిన్ వాల్‌ను ఢీకొని లారీ నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. ఆరోజు అక్కడ రీటేన్ వాల్ లేకపోయుంటే లారీ లోయలోకి దూసుకుపోయేది.



నుజ్జైన లారీ (ఫైల్)

### ట్రాఫిక్ సమస్యలు

అనంతగిరి మండలంలోని దసరా రోజున మూడు చోట్ల చెట్లు విరిగి పడిన కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఈదురు గాలులు ములియగుడ, డముకు, ఘాట్‌రోడ్డు, తుమ్మనవలస చెట్లు విరిగిపడ్డాయి. గంటలకొద్ది ట్రాఫిక్ స్తంభించింది. పోలీస్‌శాఖ, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమై, స్థానికుల సాయంతో చెట్ల తొలగింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి ఎండిపోయిన చెట్లను, ఒరిగిపోయిన చెట్లను తొలగించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# ఘనంగా కిడారి శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలు



కిడారి జన్మదిన వేడుకల్లో నిరుపేదలకు చీరలు పంపిణీ



ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ

» రోగులకు పాలు, రొట్టెలు, నిరుపేదలకు చీరలు పంపిణీ

పాడేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉన్న మోదకొండమ్మ గుడి ఆవరణంలోని అరకు పార్లమెంట్ అధ్యక్షుడు, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు పాంగి పాండురంగస్వామి, అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయం వద్ద గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అలాగే మోదకొండమ్మ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలను అందజేశారు. ఇలాంటి జన్మదిన వేడుకలను కిడారి శ్రావణ్ కుమార్ మరెన్నో జరుపుకోవాలని పలువురు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలోని జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, మాజీ ఎంపీపీ పిన్నయ్యదొర, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జ్ఞాన్ ప్రకాశ్, ఎంపీటీసీ కొమ్మ రామ, సర్పంచ్‌లు పార్వతమ్మ, శశిభూషన్, సత్యనారయణ, బీజేపీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పాలు,రొట్టెలు అందిస్తున్న టీడీపీ నేతలు

### ముంచంగిపుట్టులో..

**ముంచంగిపుట్టు:** మండల కేంద్రంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, మాజీ మంత్రివర్యులు కిడారి శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా కిడారి ఆయురారోగ్యాలతో ఉండాలని స్థానిక అంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేయించారు. అనంతరం కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, ప్రధాన కార్యదర్శి కె.జగత్రాయ్, రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రటరీ ఎ.తిరుపతి రావు, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.బాబుజీ, సర్పంచులు వి.లక్ష్మణ్, కె.శివశంకర్, నేతలు కె.బలరాం, వి.రామస్వామి, బి.రామారావు, వి.జగదీష్, ఎం.చిన్నిబాబు, కె.పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

### అనంతగిరిలో ..

**అనంతగిరి:** మండలంలోని చిలకలగెడ్డలోని టీడీపీ అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, అలాగే మండల కేంద్రంలోని మండల ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు ఆధ్వర్యంలోని జీసీసీ చైర్మన్ కిడార శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.

# బాలికా సంరక్షణ అందరి బాధ్యత

పెదబయలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, పౌష్టికాహారం, చట్టపరమైన హక్కులు, వైద్య పరమైన అవసరాలు వంటి అంశాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని పెదబయలు మాతా శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారి జె.స్రవంతి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న కేజీబీవి, జీటీ డబ్ల్యు గర్ల్-1 పాఠశాలల్లో విద్యార్థులకు పలు అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు, ఫోన్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలికా సంరక్షణ అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. బాలికల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు ఉపాధ్యాయులు అన్ని అంశాల గురించి చర్చించాలని సూచించారు. అనంతరం కిశోర బాలికలకు బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పుష్ప జోసెఫ్, సూపర్‌వైజర్ పైడిమంగమ్మ, కె.సింహాచలం, ఎం.సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలు అరికట్టాలి

**చింతపల్లి:** బాల్య వివాహలను అరికట్టడానికి అన్ని శాఖల అధికార్లు సహకరించాలని సీడీపీవో శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సూపర్‌వైజర్ సహకారంతో తాజంగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యలోనే వివాహాలు జరిగితే శారీరకంగా మానసికంగా సమస్యలు వస్తాయని అన్నారు. గిరిజన బాలికలు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై వ్యాసరచన పోటీలు, మ్యూజికల్ చైర్ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పెదబయలు పాఠశాల విద్యార్థులతో ప్రాజెక్టు అధికారి జె.స్రవంతి

### పురుషులతో సమానంగా రాణించాలి

**అనంతగిరి :** పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో సమానంగా రాణించాలని సీడీపీవో సుగుణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలోని మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పురుషలతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలనే తెగింపు ఆడపిల్లలో విద్యార్థి దశ నుంచే అలవడాలని అన్నారు. బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని హెచ్ఎం మంగమ్మ, వార్డెన్ గంగభవాని, సూపర్‌వైజర్ సంతోషికుమారి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాడేరు ఎక్సైజ్ శాఖ అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటోందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ టీవీవీఎస్ఎన్.ఆచారి తెలిపారు. స్టేషన్ పరిధిలో 9 మద్యం దుకాణాలుపై నిరంతరం తనిఖీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 63 కేసులు నమోదు చేసి 96.56 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే 63 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.



సీఐ టీవీవీఎస్ఎస్ ఆచారి

## వైద్యాధికారుల సమస్యలను పరిష్కరించాలి

వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శెట్టి నాగరాజు

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శెట్టి నాగరాజు కోరారు. జీవో నెంబరు 143 వల్ల ఈ ప్రాంతంలో పీహెచ్‌సీల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయిదన్నారు. జనాభా ప్రాతిపదికన పీహెచ్‌సీలో రెండు, మూడు సూపర్‌వైజర్ పోస్టులు ఉండాలి, కానీ ఒకరు మాత్రమే ఉన్నారు. ఎంపీహెచ్‌వో, సీహెచ్‌వో కేడర్ పోస్టులు తగ్గిపోవడం వల్ల సూపర్‌వైజింగ్ చేయడంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. జిల్లాలో 210 సచివాలయాలు ఉండగా 144 మంది హెల్త్ అసిస్టెంట్‌లు మాత్రమే ఉన్నారని, వారే ఇబ్బందులు పడుతూ గ్రామ సందర్శనలకు వస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధికి పీఎం జన్‌మన్ దోహదం

» పంచాయతీ కార్యదర్శి ఎం.రేష్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి ఎం.రేష్మ

కొయ్యూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పీఎం జన్‌మన్, ఆది ఖర్మయోగి అభియాన్, ఆది సేవ కేంద్రాలు దోహదపడతాయని, ఈ పథకాలపై అందరికి అవగాహన అవసరమని డౌనూరు పంచాయతీ కార్యదర్శి ఎం.రేష్మ పేర్కొన్నారు. మంగళవారం డౌనూరు పంచాయతీ పరిధి తులబాడ, నిమ్మలపాలెం, గొప్పువీధి, జోడుమామిడి గ్రామాల్లో సర్పంచ్ భవాని ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి పీఎం జన్‌మన్, ఆది ఖర్మయోగి అభియాన్, ఆది సేవ కేంద్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాగునీటి వనరుల క్లోరినేషన్, గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం గ్రామంలో ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో మేలు

» జిల్లా జలవనరుల ఏడీఏ ప్రభాకర్

చింతపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని జిల్లా జలవనరుల కేంద్రం ఏడీఏ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో నిర్వహించిన ఇండిగ్యాప్ పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఆదివాసీలు సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేసేవారని తెలిపారు. కాలక్రమేణ రసాయన ఎరువులు, క్రిమిసంహారక, మందులకు రైతులు అలవాటు పడి వ్యవసాయంలో సేంద్రియ ఎరువులను వాడకం తగ్గించారని తెలిపారు. విటీ వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు పంటలకు ఉపయోగపడే సూక్ష్మక్రిములు మరణిస్తున్నాయని తెలపారు. సేంద్రీయ ఎరువులు వాడతూ వ్యవసాయం చేయడం ఎంతో మంచిదని, గిరిజన రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రలమంలో వ్యవసాయాధికారి టి.మధుసూదనరావు, డీఆర్‌సీ ఏవో పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి

» టీడీపీ డివిజన్ నాయకుడు పాండురంగస్వామి



రోడ్డు పనులను పరిశీలిస్తు టీడీపీ డివిజన్ నాయకుడు పాండురంగస్వామి

ముంచంగిపుట్టు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తోనే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ డివిజన్ నేత దారెల సర్పంచ్ వి.పాండురంగస్వామి అన్నారు. పంచాయతీ పరిధి కుమ్మరిపుట్టు గ్రామానికి మంగళవారం రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో కిడారి సర్వేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. తరువాత వైసీపీ ప్రభుత్వంలో రహదారి పులు పక్కదారి పట్టాయని అన్నారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో కుమ్మరిపుట్టు గ్రామానికి రూ.75.5 లక్షల నిధులతో రహదారి పనులు జరగుతున్నాయని పేర్కొన్నారు. దశలవారీగా అన్ని గ్రామాలకు రహదారి నిర్మాణాలకు తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు చావిక్య గోపాలం, వైస్ సర్పంచ్ మధు, స్థానిక నాయకులు నాగేశ్, బలరాం, సహదేవ్, త్రినాథ్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## 'గిరిజన మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి'

చింతపల్లి, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజన మహిళలు సమాజంలో గౌరవంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. ముఖ్యంగా మహిళలు అబివృద్ధి చెందేందుకు ఆరోగ్యం, పోషకం, నైపుణ్యం, ఆర్థికాభివృద్ధి విలువలతో కూడిన విద్య, సమానత్వం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలంలో 184 గ్రామాల్లోని గిరిజనుల కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా మహిళల ఆరోగ్యం, పౌష్టికాహారంపై దృష్టి పెట్టామన్నారు. మన్యంలోని క్షయవ్యాధి లక్షణాలు అధికంగా ఉన్నాయని, ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యం చేయిస్తున్నామన్నారు. గిరిజన గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి మొక్కల నాటే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సునితా, కౌన్సెలర్ విజయ, కో ఆర్డినేటర్ సుబ్బారావు గిరిజన మహిళలు పాల్గొన్నారు.

## 17 నుంచి ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల సమ్మె

పాడేరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఆరోగ్య శాఖాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ఈ నెల 17న నుంచి సమ్మె చేసేందుకు సిద్ధమవుతున్నామని పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎల్.సుందరరావు తెలిపారు. ముందుగా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజుకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సమస్యలపై అధికారులకు ఎన్నో సార్లు వినతులు అందించామని, కానీ ప్రయోజనం శూన్యం అని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెంచిన కొత్త వేతన జోవోను అమలు చేయాలని, ఎరియర్స్ చెల్లించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సరిచేయాలని, జీతంతో ముడిపెట్టిన ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని, తదితర డిమాండ్‌లు చేశారు.


## దీక్షలకు అధికారులు స్పందించకపోవడం బాధాకరం

» మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో కాఫీ తోటలు, వ్యవసాయ భూములను నష్టపోతున్న రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు డిమాండ్ చేశారు. పెదవలస గ్రామ పంచాయతీలో రిలే దీక్షలు చేస్తున్న రైతులను మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు మంగళవారం కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రైతులు సమస్యను పరిష్కరించేందుకు దీక్ష చేపడుతున్నారని, వీరి సమస్యలను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకుని వెళతానని అన్నారు. పెదవలస పంచాయతీ పరిధిలోని ఆదివాసీ రైతులు కాఫీ తోటలపై ఎన్నో ఏళ్లగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. తాము జాతీయ రహదారి నిర్మాణానిక వ్యతిరేకం కాదని, అభివృద్ధికి ఆటంకం కలిగించే పరిస్థితి ఉండదన్నారు. జాతీయ రహదారి నిర్మాణాలు ప్రారంభమై దాదాపు రెండున్నర ఏళ్లు కావస్తుందన్నారు. కానీ పెదవలస పంచాయతీ పరిధిలో కాఫీ తోటలను నష్టపోతున్న రైతులకు నేటి వరకు పరిహారం చెల్లించకపోవడం బాధకరమన్నారు.

## ఎస్ఐ కొల్లి రమణకు అవార్డు

పెదబయలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో వృత్తిలో ఎన్నో సేవలను అందించి, ఎన్నో కేసులను చేదించినందుకుగాను పెదబయలు ఎస్ఐ కొల్లి రమణకు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్ మంగళవారం ప్రశంస పత్రాన్ని అందించారు. పాడేరు ఎస్పీ కార్యలయంలో జరిగిన నేర సమీక్ష అనంతరం పాడేరు డివిజన్ పరిధిలో అతి తక్కువ సమయంలో ఎక్కువ కేసులను చేదించిన తనకు ప్రశంసలు దక్కడం సంతోషకరంగా ఉన్నదని రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.




అవార్డు అందుకుంటున్న ఎస్ఐ రమణ

## ఉమ్మడి జిల్లాకు వరం గూగుల్

- యువతకు ఉజ్వల భవిష్యత్తు
- ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

చోడవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ సంస్థ స్థాపనకు ముం దుకు రావడం నిస్సందేహంగా ఉమ్మడి విశాఖజిల్లాకు చంద్రబాబు ఇచ్చిన వరమని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేక రులతో మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక సంస్థ గూగుల్ రావడానికి విశేషంగా కృషిచేసిన చంద్రబాబు, నారా లోకేశ్‌లకు ఈ ప్రాంత వాసులు జీవితాం తం రుణప డి ఉంటారని అన్నారు. గూగుల్ రాకతో విశాఖ గూగుల్ సిటీగా మారిపోతుందన్నారు. బతుకుదెరువుకు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న యువతకు, విశాఖ ఉద్యోగాల కల్పన కేంద్రంగా మారనున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. సైబరాబాద్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దిన చంద్రబాబు సారథ్యంలోనే, విశాఖ ప్రపంచంలోనే అత్యున్నత సంస్థ గూగుల్ రూ. 87,500 కోట్ల పెట్టుబడులతో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చే యనుండడం చరిత్రగా ఆయన అభివర్ణించారు. చంద్రబాబు పాలనాదక్షతకు ఇది ఒక నిదర్శనమన్నారు. గూగుల్ డేటా సెంటర్‌తో పాటు, ఇతర దిగ్గజ టెక్ సంస్థలు యా క్సెంచర్, కాగ్నిజెంట్‌లతో పాటు ఇతర టెక్ సంస్థలు కూడా విశాఖకు క్యూ కట్టడం ఖాయమన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, వ్యాపారాలు కూడా విస్తరించనున్నాయని ఆయన తెలిపారు. ఐటీ పాలసీ ద్వారా మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో 5 లక్షల మంది యువతకు ఉద్యోగాల కల్పించాలన్న లక్ష్యంలో భాగంగానే, ప్రతిష్టాత్మక కంపెనీలు విశాఖకు క్యూ కడుతున్నాయన్నారు. అతి త్వరలోనే దేశంలోనే సిలికాన్ వ్యాలీ తరహాలో విశాఖ రూపుదిద్దుకుంటుందని, తద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసీపీ విధ్వంసక పాలనకు, టీడీపీ అభివృద్ధి సంక్షేమ పాలనకు గల వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకోనున్నారని ఎమ్మెల్యే రాజు స్పష్టం చేశారు.

## హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

- ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎలీషారావు

చోడవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో తొలగించిన మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బి. ఎలీషారావు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్వహించిన అర్హత పరీక్షల్లో ఎంపికై 2003 నుంచి జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా తామంతా వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ అ సిస్టెంట్లుగా 22ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ వచ్చామని తెలిపారు. అయితే తమలో కొందరు తమకంటే తక్కువ అర్హత ఉన్న వ్యక్తులు ఉద్యోగాలు చేస్తున్నారని కోర్టుకు వెళ్లడంతో సుప్రీం కోర్టు అనర్హులను తొలగించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. తెలంగాణలో తమ లాగే పనిచేస్తున్న వారిని కొనసాగించారని, ఏపీలో మాత్రం విధుల్లోనుంచి తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చారన్నారు. 22 ఏళ్లుగా పనిచేస్తున్న తమను తొలగించడం వల్ల ఆధారం కోల్పోయి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.తిరిగి విధుల్లోకి తీసుకుని ఆదుకోవాలని కోరారు.

## స్వయం ఉపాధి కోర్సులపై విద్యార్థులకు శిక్షణ



కొత్తకోటలో శిక్షణ ఇస్తున్న ఒకేషనల్ శిక్షకురాలు మీనాక్షి

రావికమతం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులపై శిక్షణ ఇస్తున్నామని హెచ్‌ఎం జేజే రాజ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు భవిష్యత్తులో ఉత్తమంగా తీర్చుదిద్దుకునేలా సమగ్ర శిక్ష అభియాన్ పథకంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటిఐటిఈఎస్) విభాగంలో కంప్యూటర్ పరిజ్ఞానం కల్పిస్తూ రైల్వే రిజర్వేషన్ టికెట్స్ బుకింగ్, ఆన్లైన్ సర్వీస్ పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే, వృత్తి విద్య స్వయం ఉపాధి కోర్సులపై శిక్షణ కల్పిస్తున్నట్టు తెలిపారు. దసరా సెలవుల నుంచి ఒకేషనల్ శిక్షకురాలు ఎస్. మీనాక్షి ఈ నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పిస్తున్నారన్నారు.

## చెత్త డంపింగ్‌పై ఆగ్రహం



పంచాయతీ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన గ్రామస్థులు

రావికమతం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీధుల్లో ఊడ్చిన చెత్తను స్థానిక గుర్రయ్య కట్టు వద్ద ఉన్న శ్మశానం సమీపంలోని డ తరలిస్తున్న చెత్త ట్రాక్టర్‌ను గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. చెత్త డంపింగ్‌తో వర్షాలకు అతి కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని అక్కడి వ్యవసాయ పశువుల పాకల వద్ద, పొలాల్లోని రైతులు అగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఖాళీ స్థలంలో వేస్తే ఎస్సీ కాలనీ వాసులు అడ్డుకున్నారని, శాశ్వత డప్పింగ్ యార్డుకు స్థలం సమకూరే వరకు గ్రామ శివారులో శ్మశాన వాటిక వద్ద తాత్కాలికంగా చెత్త వేసినా నిలువరించడం సరికాదని స్థానిక ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు అభ్యంతరం వ్యక్తంచేశారు.

## బాల్య వివాహాల నిరోధానికి సమష్టి కృషి



రోలుగుంట కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

రోలుగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టడానికి సమష్టిగా కృషి చేయాలని ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్లు హైమావతి, షేక్ మెహర్ అనీసా బేగం అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీ విద్యాలయంలో బాల్య వివాహాలు, లింగ వివక్షతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. బాల్య వివాహ రహిత సమాజం సాకారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం బాలికలకు లింగ వివక్షత, బాల్య వివాహాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ తులసీ, మహిళా పోలీసు రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, దివ్య, జగదాంబ, నూకరత్నం, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మండల సమావేశం రేపు

చీడికాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల16వ తేదిన మండల సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు ఎంపిపి కురచా జయమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు మండల స్థాయి అధికారులు రావాలని ఆయన కోరారు.



కోనాం జలాశయంలో నిండుకుండలా నీరు



సమీపంలో శివపార్వతుల విగ్రహాలు

# కనువిందుచేస్తున్న కోనాం అందాలు

- కళకళలాడుతున్న జలాశయం
- పరిసరాల్లో ప్రత్యేక ఆకర్షణగా జలపాతాలు

చీడికాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం జలాశయం పరిసరాలు ప్రకృతి అందాలు కనువిందుచేస్తున్నాయి. చీడికాడకు ఎనిమిది కిలోమీటర్లు, మాడుగులకు 12కిలోమీటర్లు, చోడవరం నుంచి 20కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ జలాశయానికి ఎగువ ప్రాంతాల్లో ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడంతో పుష్కలంగా నీరు వచ్చి చేరింది.పాడేరు, అనంతగిరి, హుకుంపేట మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలనుంచి జలాశయంలోకి వర్షపునీరు వస్తుంది. దీంతో నిండుకుండలా కళకళలాడటంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. జలాశయానికి చుట్టూ దేవాలయాలు, శివపార్వతుల విగ్రహాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటోంది. జలాశయం గరిష్ఠస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.60మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 340 క్యూసెక్కులు కాగా, ఎగువ, దిగువ కాలువల ద్వారా 170క్యూసెక్కులు వరదనీటిని బొడ్డేరులోకి విడుదల చేస్తున్నారు. జలాశయాన్ని ఆనుకొని బొగొండమ్మ, దుర్గాదేవి ఆలయాలు ఉండగా, జలాశయానికి 300మీటర్ల దూరంలో మెయిన్‌రోడ్డు పక్కన శివపార్వతుల విగ్రహాలు, పచ్చని మామిడిచెట్లు ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. జలాశయానికి ఉత్తర, పడమర దిశల్లో



పిక్నిక్‌లకు వీలుగా పచ్చని తోటలు

రెండు జలపాతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కార్తీకమాసం ప్రారంభంనుంచి జనవరిలో పండగలు, తీర్థాలు ముగిసేవరకూ కోనాంనకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే అధికారులు స్పందించి జలాశయం పరిసరాలను అభివృద్ధి చేస్తే మరింత ఆహ్లాదకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్పందించాలని స్థానిక మాజీ సర్పంచ్ చలుగు అప్పలనాయుడు ప్రభుత్వాన్ని కోరారు.

# డీ పట్టా భూ సమస్యలకు పరిష్కారం

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాని రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని వమ్మలి జగన్నాథపురంలో డీపట్టా రైతుల ఎంజాయ్‌మెంట్ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో మాడుగుల ఎమ్మెల్యే బండారు , చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మాడుగుల మండలంలో ఉరలోవకొండ, నాగళ్లకొండ, కొప్పు కొండమ్మ, అడ్డుకొండ ప్రాంతాల్లో 483 మంది రైతులు 681 ఎకరాలకు డీ పట్టాలు పొందారన్నారు. అయితే వారిపేర్లు , సంబంధిత భూ వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారన్నారు. ఈ విషయం కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో కమిటీ వేశారని, సర్వే చేసి ఆయా భూముల్లో సర్వేనంబర్లు, రైతుల వివరాల సేకరించి కలెక్టర్‌కి నివేదిస్తారన్నారు. అనంతరం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నదన్నారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

జు మాట్లాడుతూ భూ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నదన్నారు. భూములు సర్వే చేపట్టి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి పక్కాగా రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు రమాదేవి, అంబేడ్కర్‌లతో పాటు ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ రాజారామ్, టీడీపీ మండల అధ్యక్షులు నందారపు సన్యాశిరావు, అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# దేవరాపల్లి పంచాయతీలో నిధులు గోల్‌మాల్

- బిల్ కలెక్టర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

దేవరాపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్‌పంచాయతీ కార్యాలయంలో నిధులను బిల్ కలెక్టర్‌గా పని చేసిన జె.జోగి రాజు గోల్‌మాల్ చేసినట్టు ఆరోపణలు ఉ న్నాయి. ఈ ఉద్యోగిపై పంచాయతీ ఈఓ బి.ఎ. అనంత ఉమాదేవీతో పాటు, ఎంపీడీఓ ఎం.వి.సువర్ణరాజు వేర్వేరుగా డీపీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఈవిషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఈఓ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పనిచేస్తూ జె.జోగిరాజు, దేవరాపల్లి పంచాయతీకి గత ఏడాది అక్టోబరులో బదిలీపై వచ్చారు. ఆయన అక్కడ పనిచేసిన కాలంలో పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొవడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో దేవరాపల్లికి గత ఏడాది బదిలీపై వచ్చారు. మునగ పాకలో ఇళ్ల పన్నులో రూ.4.45లక్షలు జోగిరాజు స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. ఈ అభియోగంపై దేవరాపల్లిలో పనిచేస్తున్న అతడిని ఈ ఏడాది మే26న డీఈవో సస్పెండ్ చేశారు. అయితే, జోగిరాజు తన వద్ద రికార్డులను కార్యాలయాలనికి అప్పగించలేదు.దీనికితోడు బీరువా తాళాలు సైతం అతని వద్దే ఉంచుకున్నాడు. ఈఓ అతనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో జూన్ 6న ఫిర్యాదు చేశారు. డీపీవో, ఎంపీడీఓ నుంచి ఆదేశాలు వస్తే తప్పా ఫిర్యాదు స్వీకరించ లేమని పోలీసులు సూచించడంతో ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారు.

దేవరాపల్లి పంచాయతీలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.13లక్షలు వసూలు కావాల్సి ఉంది. కానీ, గత అక్టోబరు నుంచి ఈ ఏడాది మే25 వరకు సుమారు రూ.6లక్షలు మాత్రమే బ్యాంకులో జమ అయింది. మిగతా సొమ్ముపై స్పష్టత రావల్సి ఉంది. కాగా, తమ వద్ద ఉన్న ప్రాథమిక సమాచారంతో ఇళ్ల పన్ను కోసం కొంత మందికి పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఫోన్ చేస్తే వారి అప్పటికే చెల్లించినట్లు రశీదు చూపించడంతో చూపడంతో ఈవో విస్మయం వ్యక్తంచేస్తున్నారు. దీంతో మునగపాకలో తరహాలోనే దేవరాపల్లిలోనూ ఇంటి పన్ను సొమ్ము బిల్లు కలెక్టర్ స్వాహా చేసిఉంటాడన్న అనుమానాన్ని ఆమె మంగళవారం ఈవో విలేకరుల ముందు వ్యక్తం చేశారు. అతనిపై ఎంపీడీఓకి గత నెల 20న ఫిర్యాదు చేశానన్నారు. ఈ ఫిర్యాదు కాపీని డీపీవోకు పంపించామని ఎంపీడీఓ సువర్ణరాజు పేర్కొన్నారు.



దేవరాపల్లి గ్రామ సచివాయం

## యువకుడికి ఆర్థిక సాయం

బుచ్చెయ్యపేట అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిట్టియ్యపాలెంనకు చెందిన యువకుడు బుదిరెడ్డి మురళి విద్యుత్, పనులు చేస్తు ఉంటాడు. ఈ క్రమంలో విద్యుదాఘానికి లోనై విశాఖ కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్నాడు.మంగళవారం రాజాం, కూండ్రం జోన్‌లోని శ్రీ శివ నూకాంబికా మైక్ అండ్ లైటింగ్ యూనియన్ సభ్యులు మురళిని పరామర్శించారు. రూ. 15 వేల ఆర్థిక సాయం అందచేశారు. మురళి త్వరగా కోరుకోవాలని వారు ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో మరిసా నరేశ్ ,తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందతున్న మురళికి సాయం అందచేస్తున్న యూనియన్ సభ్యులు

## 18న రిజర్వేషన్ పోరాట సదస్సు

రోలుగుంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ఈ నెల 18న నిర్వహించనున్న రిజర్వేషన్ పోరాట సదస్సును జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి పేర్కొన్నారు. మంగళవారం రత్నంపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సామాజిక న్యాయం, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలుపై ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ రంగంలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మండలం నుంచి పెద్దఎత్తున అన్ని సామాజిక వర్గాలకు చెందిన మేధావులు విశాఖలోని హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## గూగుల్ రాకపై సంబరాలు

చోడవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ పెట్టుబడులను స్వాగతిస్తూ మంగళవారం రాత్రి స్థానిక కొత్తూరు జంక్షన్‌లో ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు బాణ సంచా కాల్చి సందడి చేశారు. సీఎం చంద్రబబు, మంత్రి నారా లోకేశ్‌లు సాధించిన విజయంగా ఎమ్మెల్యే అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందర్ప రమణమూర్తి, టీడీపీ నాయకులు ఎర్రంశెట్టి చిన్న, సకురు కోటేశ్వరరావు, గూనూరు సురేష్, గోవాడ షుగర్స్ కార్మిక సంఘం నాయకులు కనిశెట్టి రామునాయుడు, ఏడువాక లక్ష్మణకుమార్, బాలి బోయిన దేముడు, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, కొట్టాపు చిన్న, చీపురుపల్లి సూర్యనారాయణ, పనసారెడ్డి, బీజేపీ నాయకులు కందర్ప రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో బాణ సంచా కాల్చుతున్న ఎమ్మెల్యే, నాయకులు



దేవరాపల్లి మిఠాయిలు పంచుతున్న కూటమి నాయకులు

### డెటా హబ్‌గా విశాఖ..

దేవరాపల్లి: విశాఖలో ఏఐ హబ్ (డేటాసెంటర్) ఏర్పాటుకు 15 బిలియన్ డాలర్లు గూగుల్‌తో ఆంధ్రప్రదేశ్ ఒప్పందం చేసుకోవడంపై కూటమి నాయకులు మిఠాయిలు మంగళవారం పంచారు. స్థానిక రైవాడ అతిథి గృహ ఆవరణలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కిపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, సహకార సంఘం అధ్యక్షుడు పూడిసత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ విగ్రహావిష్కరణ



హైస్కూల్‌లో విగ్రహావిష్కరిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురంలో జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మంగళవారం రాత్రి మహ్మాత్మాగాంధీ విగ్రహాన్ని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని స్థానిక అల్లూరిసీతారామరాజు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్య పోరాటంతో గాంధీ అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఆయన బాటలో అంతా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ కొల్లూరి పార్వతి, నాయకులు కుసుమంచిలి వెంకటకృష్ణ, లక్ష్మణరావు, హరికృష్ణ, ఎంఈవో కృష్ణప్రసాద్, అల్లూరివాసవిక్లబ్ అధ్యక్షుడు చెక్కా సంతోష్, రామారావు, బొలిశెట్టిపాపారావు, నాగేశ్వరావు తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చెట్టుపల్లిలో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ రమణ

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం సీడీపీఓ జీవీ రమణ మంగళవారం చెట్టుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వన్యజాతి మొక్కల ప్రదర్శన

చోడవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం బోటనీ విభాగం ఆధ్వర్యంలో వన్యజాతి మొక్కల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో స్థానికంగా లభించే పోషక, ఔషధ గుణాలు కలిగిన ఆకుకూరలకు సంబంధించిన మొక్కలను ప్ర దర్శించి వాటి విలువలను విద్యార్థులకు వివరించారు. నల్లేరు, తూటికూర, పొన్నగంటి కూర, వెలగ మారేడు, తంగేడు, నేలవేము, తదితర మొక్కలను ప్రదర్శనలో ఉంచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

## పశుదాణా పాత్రలు పంపిణీ

మాడుగుల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖడెయిరీ పాడిరైతులకు పశుదాణా పాత్రలు పంపిణీ కార్యక్రమం మండలంలో చేపట్టారు. చోడవరం యూనిట్, వడ్డాది బీసీసీ పరిధిలోని వీరవిల్లి అగ్రహారం1, 2, శ్రీరాంనగర్, చింతలూరు గ్రామాల్లోని 373 మంది పాడిరైతులకు ఈ పాత్రలను డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో అందించారు. పాడిరైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సిబ్బంది, సంఘంసభ్యులు అప్పారావు, రాజేశ్వరరావు, ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



వీరవిల్లిఅగ్రహారంలో పాడిరైతులకు పాత్రలు అందిస్తున్న దృశ్యం

# ఆధ్యాత్మిక కేంద్రంగా కోమళ్లపూడి



ఆలయ ముఖద్వారానికి రంగులు వేస్తున్న పెయింటర్

## చెరువు మధ్యలో శైవక్షేత్రం

- శివపార్వతుల భారీ విగ్రహాలు
- గట్టుపై ద్వాదశ జ్యోతిర్లింగాలు
- చెరువు చుట్టూ చెట్లు, మొక్కల పెంపకం
- భక్తులు సేదతీరేందుకు పలు రకాల సదుపాయాలు
- కార్తీక మాసం మొదలయ్యేనాటికి అందుబాటులోకి ఆలయం



చోడవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): **చోడవరం నియోజకవర్గంలో మరో శైవక్షేత్రం రూపుదిద్దుకుంటున్నది. బీఎన్ రోడ్డును ఆనుకుని రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల సరిహద్దులో కోమళ్లపూడి సమీపంలో సువిశాలమైన తటాకం మధ్యలో నిర్మిస్తున్న ఈ ఆలయ పనులు తుది దశకు చేరుకున్నాయి. కార్తీక మాసంనాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఆలయ నిర్మితులు ఏర్పాట్లు చేస్తున్నారు.**

విశాఖ డెయిరీ డైరెక్టర్, టీడీపీ నాయకుడు గేదెల సత్యనారాయణ తన తల్లిదండ్రులు కృష్ణంనాయుడు, వెంకయ్యమ్మల పేరిట సొంత నిధులు కోటిన్నర రూపాయలు వెచ్చించి శైవక్షేత్ర నిర్మాణానికి పూనుకున్నారు. కోమళ్లపూడి పరిధిలో వున్న బురదవాని చెరువు మధ్యలో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. చెరువు గట్టు నుంచి మధ్య వరకు నీటిలో పిల్లర్లు వేసి, వాటిపై శ్లాబ్ నిర్మించారు. విశాఖలోని కైలాసగిరిలో మాదిరిగా శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. శివుడి శిరస్సు పైనుంచి గంగ ప్రవహించేలా విగ్రహాలను రూపొందించారు. భక్తులు కార్తీక స్నానాలు ఆచరించేందుకు చెరువు గట్టుకు ఒకవైపు ఘాట్ (మెట్లు) నిర్మించారు. మెయిన్ రోడ్డు నుంచి ఆలయానికి వెళ్లే దారిలో చెరువు గట్టుపై ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటికి తుది మెరుగులు దిద్దుతున్నారు. చోడవరం నియోజకవర్గంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు వున్న తొలి ఆలయం ఇదే కావడం విశేషం. చెరువు గట్టుపై వివిధ రకాల చెట్లు, మొక్కలు పెంచడానికి, భక్తులు చెరువులో బోటు షికారు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్, భక్తులు కూర్చోడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. కార్తీక మాసం మొదలయ్యేనాటికి ఆలయ నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని, భవిష్యత్తులో ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఆలయ నిర్మితులు గేదెల సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.



చెరువు మధ్యలో నిర్మిస్తున్న శైవక్షేత్రం. (ఇన్‌సెట్‌లో) ఆలయంలో శివపార్వతుల విగ్రహాలు



తుది మెరుగులు దిద్దుకుంటున్న ద్వాదశ జ్యోతిర్లింగాలు

## ఇద్దరు ఆటో డ్రైవర్ల లైసెన్సుల రద్దుకు సిఫారసు



ఎక్కువ మంది విద్యార్థులను తీసుకెళుతున్న ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళుతున్న ఇద్దరు డ్రైవర్ల లైసెన్సులను రద్దు చేయాలంటూ పట్టణ పోలీసులు మంగళవారం రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేశారు. సోమవారం సాయంత్రం పోలీసులు శారదా బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక ఆటోలో 11 మంది, మరో ఆటోలో 13 మంది విద్యార్థులను తీసుకువెళ్లడాన్ని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ గుర్తించారు. దీంతో ఆటోలను ఆపి కేసులు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఎస్పీ తుహిన్ సిన్హా దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేయడానికి ఆర్టీవో కార్యాలయానికి లేఖతోపాటు వివరాలు పంపినట్టు సీఐ తెలిపారు.

## సూపర్ జీఎస్టీతో తగ్గిన భవననిర్మాణ సామగ్రి ధరలు



బ్రోచర్‌ను ఆవిష్కరించిన అధికారులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్'తో భవన నిర్మాణ సామగ్రి ధరల తగ్గింపుపై మంగళవారం స్థానిక గుండాల జంక్షన్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. భవన నిర్మాణాలకు ఉపయోగించే వివిధ వస్తువులను జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు సింధుప్రియ, ప్రేమ్‌కుమార్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌లు పీవీ శైలజ, పి.శ్వేత సందర్శించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల భవన నిర్మాణదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సిమెంట్‌పై గతంలో 28 శాతం ఉన్న జీఎస్టీ ఇప్పుడు 18 శాతానికి తగ్గిందన్నారు. మార్బుల్స్, గ్రానైట్ పలకలపై జీఎస్టీ 12 శాతం నుంచి ఐదు శాతానికి, ఉడెన్ ఫోరింగ్ టైల్స్‌పై 18 నుంచి 12 శాతానికి తగ్గాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ ఎస్.శేఖర్, టీపీవో వరప్రసాద్, డీఈ గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, బిల్డర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

## చెక్కపై అబ్దుల్ కలాం రూపం



నక్కపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారుడు దార్ల రవి చెక్కపై ఆయన రూపాన్ని అద్భుతంగా చెక్కారు. సందర్భంగా ఎండు గంటల పాటు శ్రమించి దీనిని రూపొందించినట్టు రవి చెప్పారు.

## ఎక్సైజ్ సురక్ష యాప్ మద్యం సీసాలకే పరిమితం

అనకాపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ లిక్కర్ బాటిల్స్ స్కాన్ చేయడానికి మాత్రమేనని, బీరు సీసాలకు ఇది వర్తించదని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, మద్యం దుకాణంలో కొనుగోలు చేసిన మద్యం ప్రభుత్వం సరఫరా చేసిందా? కాదా? అన్నది సీసా మూతపై అతికించిన స్టిక్కర్‌పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ స్టిక్కర్ బీరు సీసాలపై అతికించనందున వీటిని స్కాన్ చేయడం వీలుకాదన్నారు.

## నేడు నాగేంద్రబాబు పర్యటన

ఎలమంచిలి, అక్టోబరు 14: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు బుధవారం మండలంలోని ఏటికొప్పాకలో పర్యటించి లక్కబొమ్మల కళాకారులతో సమావేశం కానున్నట్టు పార్టీ ఎలమంచిలి కార్యాలయం ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డు మార్గంలో వచ్చే ఆయనకు మధ్యాహ్నం రెండు గంటలకు షేకిళ్లపాలెం హైవే ఘనస్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులంతా తరలిరావాలని కోరారు. జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇన్‌చార్జి సుందరపు సతీశ్‌కుమార్, ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఆయన వెంట వుంటారని, హస్తకళాకారులతో మాట్లాడిన అనంతరం సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎలమంచిలి బాలికలు ఎంపిక



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలికలతో హెచ్‌ఎం, పీఈటీలు

ఎలమంచిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్లలో స్థానిక తులసీనగర్‌లోని బాలికోన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థినులు స్థానం సంపాదించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన విశాఖలోని ఏయూ క్రీడా మైదానం, పోర్టు స్టేడియం, కైలాసపురం ప్రాంతాల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. బాలికోన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థినులు ఉత్తమ ప్రతిభచూపడంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్లకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం కె.సుశీల, పీడీలు మూర్తి, శిరీష, పూర్ణిమ అభినందించారు.





## బీఎన్ రోడ్డులో మళ్లీ అవే కష్టాలు

- గోతిలో భారీ ట్రాలీ కూరుకుపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం



మేడివాడ వినాయక గుడి సమీపంలో బీఎన్ రోడ్డులోని గోతిలో కూరుకుపోయిన భారీ గ్రానైట్ ట్రాలీ

రావికమతం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డు మేడివాడ వినాయక గుడి వద్ద మంగళవారం ఉదయం గ్రానైట్ లోడుతో వెళుతున్న భారీ ట్రాలీ గోతిలో కూరుకుపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయ ఏర్పడింది. ఈ ట్రాలీని పైకి తీసేందుకు మూడు ఎక్స్‌కవేటర్లతో నాలుగు గంటల పాటు గ్రామస్థులు, ట్రాలీ సిబ్బంది శ్రమించారు. ఎట్టకేలకు ట్రాలీ బయటకు రావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సోమవారం ఇదే ప్రాంతంలో ఓ లారీ కూరుకుపోయి ట్రాఫిక్ నిలిచిపోగా, మంగళవారం కూడా అదే పరిస్థితి తలెత్తడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఈ రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసే వారు ఈ మార్గంలో భారీ వాహనాలను అనుమతించవద్దని అధికారులను పలువురు కోరుతున్నారు.

## కొండ పోరంబోకు కబ్జా

**40 సెంట్లు ఆక్రమణ.. షెడ్డు నిర్మాణం**

**స్థలం విలువ రూ.4 కోట్లు పైమాటే**



అమృతపురంలో ఆక్రమణకు గురైన కొండ పోరంబోకు భూమి

సబ్బవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతపురంలో కొండ పోరంబోకు భూమి కబ్జాకు గురైంది. ఈ భూమిలో వారం రోజులుగా షెడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. అమృతపురం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 303/2లో 56.5 ఎకరాల్లో కొండ విస్తరించి ఉంది. దీనికి ఒకవైపున బీసీ కాలనీకి గతంలో భూమి కేటాయించారు. ఇంకా సుమారు 20 ఎకరాలు మిగిలి ఉంది. ఇందులో గ్రావెల్ తవ్వకాలకు గతంలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని, కొంత భూమి కబ్జాకు గురైందంటూ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ఆధారాలతో హైకోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో న్యాయస్థానం ఆదేశాలతో గ్రావెల్ తవ్వకాలు ఆగిపోయాయి. అయితే వారం రోజుల క్రితం బీసీ కాలనీకి అనుకొని ఉన్న సుమారు 40 సెంట్ల భూమిని కొంతమంది ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేపట్టారు. సబ్బవరం-షీలానగర్ ప్రతిపాదిత సాగరమాల రోడ్డును ఆనుకొని వుండడంతో ఇక్కడ భూముల విలువ గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఇక్కడ సెంటు సుమారు రూ.10 లక్షలు వుంది. ఈ ప్రకారం కబ్జాకు గురైన భూమి విలువ రూ.4 కోట్లు వుంటుందని అంచనా. కాగా భూ ఆక్రమణపై తహశీల్దార్ బి.చిన్నికృష్ణను వివరణ కోరగా.. ఈ విషయం ఇప్పటికే తమ దృష్టికి వచ్చిందని, మంగళవారం సిబ్బందితో కలసి పరిశీలించామన్నారు. ఇక్కడ నిర్మాణాలు చేపడితే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్టు చెప్పారు.

## వీఓఏల కాల పరిమితి సర్క్యులర్ నిలిపివేతపై హర్షం



కేక్ కట్ చేస్తున్న వీఓఏలు, సీఐటీయూ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీఓఏల కాల పరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం నిలిపివేయడంతో మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు వీవీ శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ, వీఓఏల మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఆరేళ్ల నుంచి పోరాటాలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన ఈ జీవోను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం 1,292 మంది వీఓఏలు 39,579 స్వయం సహాయ సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్నారన్నారు. వీఓఏల మిగిలిన డిమాండ్లు, సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెలా ఐదో తేదీకల్లా వేతనాలు చెల్లించాలని కోరారు.

## ఉత్తరాంధ్రలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణమే లక్ష్యం

- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి



ఎస్ఆర్‌పురంలో మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న పీడీ పూర్ణిమాదేవి

పెందుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణంతో వినూత్న పారిశుధ్య వ్యవస్థకు శ్రీకారం చుట్టామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలోని ప్రతి పల్లెలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణమే తమ లక్ష్యమన్నారు. పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ (సీఆర్డీ) ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఫీల్డ్ స్టాఫ్ మేనేజర్లకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. మ్యాజిక్ డ్రెయిన్ల వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. వంద మీటర్ల డ్రెయిన్లను నిర్మించడానికి రూ.నాలుగు లక్షల వ్యయమైతే మ్యాజిక్ డ్రెయిన్‌కు రూ.90 వేలు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. చీఫ్ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ మాట్లాడుతూ మ్యాజిక్ డ్రెయిన్లపై గ్రామీణులను చైతన్యవంతుల్ని చేయాలన్నారు.

## కలెక్టర్ రాజయ్యపేట పర్యటన వాయిదా

... 5వ పేజీ తరువాయి

మాట్లాడారు. 15వ తేదీన రాజయ్యపేట వద్ద మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు ఆమె రాజయ్యపేట వెళ్లనున్నట్టు అధికారులు మంగళవారం ప్రకటించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అయితే వ్యక్తిగత కారణాలతో కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం సాయంత్రం అత్యవసరంగా తమిళనాడు (సొంతరాష్ట్రం) బయలుదేరి వెళ్లారు. దీంతో రాజయ్యపేటలో కలెక్టర్ పర్యటన వాయిదా పడింది. రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని మత్స్యకార నాయకులకు తెలియపరిచారు.

## ఉపాధిలో అక్రమాలకు చెక్

... 5వ పేజీ తరువాయి

అధికారులను ఆదేశించింది. దీంతో ఈ నెల నాలుగో తేదీ నుంచి ఉపాధి కూలీలకు ఈకేవైసీ నమోదు చేస్తున్నారు. జాబ్ కార్డులు వున్న ప్రతి ఇంటికీ వెళ్లి, ఆయా వ్యక్తుల ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేస్తున్నారు. అనంతరం మొబైల్ ఫోన్ లేదా ట్యాబ్‌తో వారి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో ఇది సెంట్రల్ సర్వర్‌లో నమోదు అవుతుంది. పనిలోకి వచ్చిన వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్‌తో ముఖ ఆధారిత హాజరు నమోదు చేయించుకోవాలి. సాయంత్రం నాలుగు గంటలకు మరోసారి హాజరు నమోదు చేయాలి. లేకపోతే పనికి రానట్టు లెక్క. ఈ విధానం నవంబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చే అవకాశం వుందని సమాచారం. జిల్లాలో ఇంతవరకు 75 శాతం మేర ఈ ప్రక్రియ పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

## ప్రారంభోత్సవాలకు నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

చేశారు కానీ హోం మంత్రి అనిత పర్యటన రద్దు అయినట్టు ముందు రోజు పోలీసు అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో మరోసారి వాయిదా వేశారు.

**గొలుగొండ, కృష్ణాదేవిపేటల్లో..**

గొలుగొండ మండలంలో గొలుగొండ, కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్లకు నూతన భవనాల నిర్మాణానికి 2018లో శంకుస్థాపన జరిగింది. ఒక్కో భవనానికి రూ.2.5 కోట్ల చొప్పున అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. నాతవరం మాదిరిగానే ఇక్కడ కూడా వైసీపీ హయాంలో చాలా కాలంపాటు పనులు జరగలేదు. చివరకు గొలుగొండ పోలీసు స్టేషన్ భవనాన్ని రెండేళ్ల క్రితం, కృష్ణాదేవిపేట భవనాన్ని పది నెలల క్రితం పూర్తిచేశారు. వీటి ప్రారంభోత్సవానికి రెండుసార్లు ముహూర్తం పెట్టారు. కానీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. గొలుగొండలో ప్రస్తుతం పోలీసు స్టేషన్ నిర్వహిస్తున్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. విధులు నిర్వహించడానికి పోలీసులు అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్ భవనం పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే తరహాలో వుంది. హోం మంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడు, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నాతవరం, గొలుగొండ, కృష్ణాదేవిపేటల్లో నిర్మించిన పోలీసు స్టేషన్ల నూతన భవనాలను ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.

## మిన్నంటిన సంబరాలు

... 5వ పేజీ తరువాయి

చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఢిల్లీలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి, గూగుల్ కంపెనీకి మధ్య చారిత్రక ఒప్పందం జరిగిన నేపథ్యంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. గూగుల్ డేటా సెంటర్‌కు వెల్‌కమ్ చెబుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అనకాపల్లిలో జరిగిన వేడుకల్లో పీలా గోవింద మాట్లాడుతూ, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషితో విశాఖనగరానికి రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడితో గూగుల్ డేటా రానుండడం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసినట్టేనని అన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని అడ్డంకులు పెట్టినా విశాఖకు ఐటీ కంపెనీలు రావడం ఖాయమని అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో రెండు లక్షల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని పేర్కొన్నారు. 12 నెలలపాటు శ్రమించి, నేషనల్ పాలసీల్లో మార్పులు చేయించి గూగుల్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటుకు చంద్రబాబునాయుడు చేసిన కృషి అనిర్వచనీయమని కొనియాడారు. నాలుగేళ్లలో విశాఖపట్నం ప్రపంచ ఐటీ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాలూ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేదుల సూర్యప్రభ, టీడీపీ నేతలు మాదంశెట్టి నీలబాబు, కర్రి బాబి, పోలారపు త్రినాథ్, బొడ్డేడ మురళీ, భానుచందర్, పీట్ల రాజు, పైలా గోపి, బొడ్డేడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం రాత్రి టీడీపీ శ్రేణులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. విశాఖకు భారీ ప్రాజెక్టు తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారంటూ మంత్రి నారా లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. పాయకరావుపేటలో టీడీపీ నాయకులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. చోడవరం పట్టణంలోని కొత్తూరు జంక్షన్‌లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు బాణసంచా కాల్చి సందడి చేశారు. మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లిలోని రైవాడ అతిథిగృహం ఆవరణలో తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు జరిపి మిఠాయిలు పంచారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అచ్యుతాపురం జంక్షన్‌లో సంబరాలు జరిపారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 125.00 |
| లైవ్ ధర | 145.00 |
| విత్ స్కిన్ | 260.00 |
| స్కిన్ లెస్ | 270.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 520 |
| విజయనగరం | 524 |
| శ్రీకాకుళం | 524 |